TGTEL/25/A0827

# ప్రజా దివాస్

తెలుగు దినపత్రిక

prajadivvs57@gmail.com

**విలేఖరులు కావలెను**

అసలైన అక్షర జ్ఞానాన్ని తెలియజేస్తూ ... విలువలతో కూడిన జీవన శైలిలో ప్రేరణ కలిగించే విషయాలపై అవగాహన కలిగిస్తూ ... ప్రజల సాధకబాధకాల్లో మమేకమై పరిష్కార మార్గాలపై ప్రేరణ కలిగించాలి అనుకుంటున్నారా.. ? బాధ్యతయుతమైన జర్నలిజంలో రాణించాలనుకుంటున్నారా ... ? అయితే రండి ... అక్షరాన్ని అనుకున్న విధంగా రాద్దాం..

సెల్ : 9000281049

నియోజకవర్గ ఇంచార్జ్‌లు, జిల్లా స్టాఫర్‌లు మండల రిపోర్టర్‌లు కావలెను...

సంపుటి : 3 సంచిక : 265 | శుక్రవారం 18-09-2026 | ఎడిటర్: ఎస్ ఎన్ మౌనిక | పేజీలు : 8 వెల 3 /-

# దేశ వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటే ఏం జరుగుతుందో

## ప్రధాని చూపించారు: చంద్రబాబు

భారత్ అభివృద్ధి చెందిన దేశంగా మారబోతోందని.. దీన్ని ఎవరూ ఆపలేరని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు.

వారణాసిలో నిర్వహించిన సేవా సంకల్ప్ అభియాన్‌లో ఆయన మాట్లాడారు.

"దేశంలో 80 కోట్ల మందికి ఉచిత రేషన్ బియ్యం పంపిణీ జరుగుతోంది.

ప్రధాని నరేంద్ర మోదీ పాలనలో 25 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారు.




ప్రతి పేదవాడికి తాగునీరు అందించాలనేదే ప్రధాని లక్ష్యం. సుమారు 11 కోట్ల మంది పీఎం కిసాన్ ద్వారా లబ్ధి పొందుతున్నారు. మధ్యవర్తులు లేకుండా రైతుల ఖాతాల్లోనే డబ్బులు జమ అవుతున్నాయి.కొవిడ్ సంక్షోభంలోనూ ప్రధాని మోదీ మంచి పాలన అందించారు. ఆ సమయంలో 140 కోట్ల మందిని ఆయన కాపాడారు. ఉచితంగా దేశ ప్రజలకు కొవిడ్ వ్యాక్సిన్లు వేశారు. ప్రపంచంలోని 101 దేశాలకు కొవిడ్ వ్యాక్సిన్లు పంపారు. గతంలో భారత్ ఆయుధాలను దిగుమతి చేసుకునేది. ప్రస్తుతం దేశంలోనే ఆయుధాల ఉత్పత్తి జరుగుతోంది. టెక్నాలజీని అర్థం చేసుకున్న ఏకైక ప్రధాని మోదీనే. మహిళలే కేంద్రంగా దేశంలో అభివృద్ధి జరుగుతోంది. బేటీ బచావో.. బేటీ పడావో, ఉజ్వల సహా తదితర పథకాల ద్వారా మహిళా సాధికారత సాధ్యమవుతోంది. మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు ఇచ్చేందుకు చట్టం చేశారు. భారత అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటే ఏం జరుగుతుందో ప్రధాని చూపించారు. ఆపరేషన్ సిందూర్ ద్వారా భారత్ సత్తాను ప్రపంచానికి చాటిచెప్పారు. దేశంలో తీవ్రవాదం లేకుండా చర్యలు చేపట్టారు. సుదీర్ఘకాలం నలిగిన అయోధ్య సమస్యను పరిష్కరించారు" అని చంద్రబాబు కొనియాడారు.

# భారత్ రియాక్షన్ ఇదే

## అమెరికా నుంచి 100% టారిఫ్ ముప్పు..




రష్యా నుంచి చమురు కొనుగోలు చేసే దేశాల ఎగుమతులపై 100 శాతం టారిఫ్‌లకు వీలుకల్పించే బిల్లుకు అమెరికా చట్టసభల్లో ఆమోదం లభించింది. దీనిపై అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంతకం చేస్తే.. భారత్‌పై నూరుశాతం సుంకాలు పడే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం స్పందించింది. ఈ ఆంక్షల బిల్లును ఎప్పటికప్పుడు గమనిస్తున్నామని వెల్లడించింది

# 25 ఏళ్ల నిస్వార్థ సేవ.. మోదీకి పుట్టినరోజు శుభాకాంక్షల వెల్లువ

ఈ ప్రజా సేవను మరింతకాలం కొనసాగించేలా మీరు ఆరోగ్యంగా ఉండాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నా"
- రాష్ట్రపతి ద్రౌపది ముర్ము




## విశాఖ స్టీల్ ప్లాంట్ నివాసయోగ్య ప్లాట్ల వేలానికి పచ్చజెండా

విశాఖ స్టీల్ ప్లాంట్‌కు చెందిన నివాసయోగ్య ప్లాట్లు వేలం ద్వారా విక్రయించనున్నారు. ఈ-వేలం ప్రక్రియ ద్వారా విక్రయానికి నేషనల్ లాండ్ మానిటైజేషన్ కార్పొరేషన్ షెడ్యూల్‌ను ప్రకటించింది.




## రాత పరీక్ష ద్వారానే వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ పోస్టుల భర్తీ

రాష్ట్రంలో ఏపీపీఎస్సీ ద్వారా వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ పోస్టుల భర్తీకి రాత పరీక్షను తప్పనిసరి చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఏపీపీఎస్సీ ద్వారా నియామకం కోసం నోటిఫికేషన్ విడుదలైన తర్వాత వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ పోస్టుల భర్తీ ప్రక్రియ ప్రారంభం కానుంది.

మిగతాది 2లో









# సంపాదకీయం

## బీజేపీ రాజకీయాలకు బ్రిక్స్ పాఠం!



'లోకంలో బలవంతుడైనవాడు చెబితే అధర్మం కూడా ధర్మం అవుతుంది. అదే బలహీనుడు చెప్పే ధర్మం ఎంత గొప్పదైనా దాన్ని ఎవడూ అంగీకరించడు' అని మహాభారతంలో భీష్ముడు కురుసభలో ద్రౌపది వస్త్రాపహరణ ఘట్టంలో చెబుతాడు. 'పాండవులకు జరిగిన అవమానమే భవిష్యత్తులో కౌరవులకు వ్యతిరేకంగా ప్రత్యర్థులందర్నీ ఏకం చేస్తుంది' అని అదే సభలో విదురుడు హెచ్చరిస్తాడు. 'బలవంతుడి శక్తి కంటే భయంతో ఏకమైన బలహీనుల కూటమి శక్తిమంతమైనది' అని విదురుడు చెప్పినట్లుగానే పాంచాల, మత్స్య, యాదవ, మగధ, ఛేది, కాశీ, పాండ్య, చోళ, కేకయ తదితర రాజ్యాలన్నీ పాండవుల తరఫున ఏకం అవుతాయి. చాణక్యుడైనా, ఇటాలియన్ రాజనీతిజ్ఞుడు మాకియవెల్లీ అయినా ఇంతకంటే భిన్నంగా ఏమీ ఆలోచించలేదు. న్యూఢిల్లీలో గతవారం ముగిసిన బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశంలో మహాభారతంలోని దౌత్యనీతి ప్రస్ఫుటించింది.

తాను అత్యంత బలవంతుడిననుకున్న అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌ను వ్యక్తిగతంగా బ్రిక్స్ దేశాలు పైకి పల్లెత్తు మాట అనకుండానే ఆయనకు ఒక స్పష్టమైన సందేశాన్ని పంపించాయి. ఏక పక్ష దౌర్జన్య చర్యలు, వర్తకాన్ని దెబ్బతీసే టారిఫ్ లను న్యూఢిల్లీ డిక్లరేషన్ తీవ్రంగా ఖండించింది. బ్రిక్స్ వేదికపై విభిన్న ప్రయోజనాలను ఆశిస్తున్న అనేక దేశాలు ఏకమయ్యేందుకు అవసరమైన వాతావరణాన్ని ట్రంప్ అనాలోచితంగానే అందించారు. సంక్షుభిత ప్రజాస్వామ్య భారత్, నియంతృత్వ చైనా, రష్యా దేశాలు, అమెరికాతో సన్నిహిత భద్రతా సంబంధాలు ఉన్న గల్ఫ్ దేశాలు, అమెరికా దాడిని ఎదుర్కొంటున్న ఇరాన్.. ఇవన్నీ ఒక వ్యూహాత్మక ప్రాపంచిక దృక్పథాన్ని పంచుకునేందుకు అవకాశాన్ని ట్రంప్ కల్పించారు. అమెరికా అధ్యక్షుడి దూకుడు విధానాల వల్ల ఈ దేశాలన్నీ ఒత్తిడి ఎదుర్కోవడమే ఇందుకు కారణం. డాలర్ ఆధిపత్యాన్ని సవాల్ చేసే దేశాలపై అత్యధిక సుంకాలు విధిస్తామని ట్రంప్ హెచ్చరించినప్పటికీ బ్రిక్స్ దేశాలు ప్రత్యామ్నాయ చెల్లింపు విధానాలను వెతుక్కునేందుకు ఆయనే దోహదం చేశారు. వాణిజ్యం కోసం, స్థానిక జాతీయ కరెన్సీల వాడకాన్ని న్యూఢిల్లీ డిక్లరేషన్ సమర్థించింది. పాశ్చాత్య ఆర్థిక వ్యవస్థలపై ఆధారపడటాన్ని తగ్గించుకునేందుకు ఇది సభ్య దేశాలకు ఊతమిచ్చింది.

భిన్న రాజకీయ వ్యవస్థలు, భద్రతా ప్రయోజనాలు కలిగిన కూటమి అయినప్పటికీ ఎలాంటి రణగొణ ధ్వనులు లేకుండా బ్రిక్స్ సమావేశంలో అత్యంత సమగ్రమైన, ప్రభావదాయక ఏకగ్రీవ డిక్లరేషన్‌ను విడుదల చేయగలగడమే ఆ దేశాల మధ్య ఏర్పడిన ఉమ్మడి అవగాహనకు నిదర్శనం. ప్రస్తుత అంతర్జాతీయ వ్యవస్థ ఏకపక్ష ఆర్థిక ఒత్తిళ్లకు గురవుతోందనే సాధారణ భావనే వీటన్నింటినీ ఒక తాటిపైకి తెచ్చింది. ఈ సదస్సుకు భారత్ నాయకత్వం వహించినందువల్ల సహజంగానే రెండు రోజుల పాటు జరిగిన సదస్సుకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ కేంద్ర బిందువుగా నిలిచారు.

భారత్ ప్రస్తుత పరిస్థితి కత్తి మీద సాము లాంటిది. పలు వైరుధ్యాలతో కూడిన సంబంధాలను ఏకకాలంలో సమన్వయం చేసేందుకు భారత్ ప్రయత్నించాల్సి వచ్చింది. చైనాతో సరిహద్దు ఘర్షణలు, ఆర్థిక ఆధిపత్యం నేపథ్యంలో ఆ దేశాధినేతతో సుహృద్భావ వాతావరణంలో చర్చించడం, రష్యాతో వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని కొనసాగించడం, సంక్షుభిత పశ్చిమాసియాలో ఇరాన్‌తో చర్చలు జరపడం, అభివృద్ధి చెందిన దేశాల గళంగా, గ్లోబల్ సౌత్ నేతగా అవతరించేందుకు ప్రయత్నించడం ఇందులో ముఖ్యమైనవి. అంతేకాదు, రష్యాతో రక్షణ, ఇంధన రంగ సహకారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ వదులుకోబోమని భారత్ స్పష్టం చేసింది. పాశ్చాత్య కూటములతో చేతులు కలుపుతూనే, సంప్రదాయ మిత్రులను విస్మరించబోమనే వ్యూహాత్మక స్వయంప్రతిపత్తిని ప్రకటించింది. అదే సమయంలో, భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ న్యూఢిల్లీ సదస్సులో ఒక సున్నితమైన దౌత్య వ్యూహాన్ని అవలంబించారు. పశ్చిమ దేశాలను తిరస్కరించడం పూర్తిగా తమ వ్యూహం కాదని, ఆ దేశాలతో సంబంధాలు కొనసాగిస్తూనే అభివృద్ధి చెందుతున్న దేశాల ప్రయోజనాలను ఏకకాలంలో కాపాడుకోవాలన్నదే భారత్ వైఖరి అని ఆయన స్పష్టం చేశారు. అమెరికా ఒత్తిడి, చైనా ఆధిపత్యం మధ్య భారత్ తనను తాను ఒక ఆచరణాత్మక ప్రత్యామ్నాయంగా ప్రదర్శించుకోవడానికి ప్రయత్నించింది. అదే సమయంలో వాషింగ్టన్ ఎంత గట్టిగా ఒత్తిడి తెచ్చినా, దానిపై ఆధారపడకుండా యంత్రాంగాలను అభివృద్ధి చేయగలమని చెప్పగలగడమే ఈ బ్రిక్స్ సమావేశాల ప్రత్యేకత.

చైనా అధ్యక్షుడు షీ జిన్ పింగ్ ఈ సదస్సులో చేసిన ప్రసంగం అత్యంత శక్తిమంతమైనది. 'నియమాలు లేని ప్రపంచం అంటే ట్రాఫిక్ సిగ్నల్స్ లేని కూడలి వంటిది. అంతర్జాతీయ నియమాలను అన్ని దేశాల భాగస్వామ్యంతోనే, అందరికీ ఒకే విధంగా ఉండేలా రూపొందించాలి. బలవంతుడిదే న్యాయం అనే సిద్ధాంతానికి అంతర్జాతీయ వ్యవహారాల్లో ఎలాంటి స్థానం ఉండకూడదు. ప్రపంచ దక్షిణ దేశాలు అంతర్జాతీయ వ్యవహారాల్లో చట్టబద్ధ పాలనను (రూల్ ఆఫ్ లా) సమష్టిగా పరిరక్షించాలి' అని జిన్ పింగ్ అన్నారు. బహుళ ధ్రువ ప్రపంచం అనే దాన్ని ఎవరూ మార్చలేరని, ప్రపంచాన్ని తమకోసం సుందరవనంగా, ఇతరులకు కీకారణ్యాలుగా మార్చేందుకు చేసే ప్రయత్నాలు చెల్లవని రష్యా అధ్యక్షుడు పుతిన్ ప్రకటించారు. జారిపోతున్న తమ నాయకత్వాన్ని కాపాడుకోవడానికి పాత నేతలు కొందరు ఆంక్షలు, అడ్డంకులు సృష్టిస్తున్నారని, కానీ ఇవి ప్రత్యామ్నాయ, స్వతంత్ర వాణిజ్య మార్గాలను వేగవంతం చేస్తున్నాయని ఆయన అన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రసంగంలోనూ బలమైన వ్యాఖ్యలు లేకపోలేదు. 'మనం నిబంధనలను పాటించేవారిగా (రూల్--టేకర్స్) కాకుండా, నిబంధనలను నిర్దేశించేవారిగా (రూల్--షేపర్స్) ఎదగాల్సిన అవసరం ఉంది' అని మోదీ చెప్పారు. టెక్నాలజీని, కీలక ఖనిజాలను ఆయుధాలుగా వాడుకోవద్దని ఆయన హెచ్చరించారు.

బ్రిక్స్ సదస్సులో అన్నిటికన్నా ముఖ్యమైనది ప్రధానమంత్రి నరేంద్రమోదీ, చైనా అధ్యక్షుడు షీ జిన్ పింగ్ మధ్య దాదాపు 45 నిమిషాల పాటు ద్వైపాక్షిక సమావేశం. వ్యూహాత్మక భేదాభిప్రాయాలు ఉన్నప్పటికీ పరస్పర ఆర్థిక ప్రయోజనాలకోసం పనిచేసేందుకు వారు సిద్ధంగా ఉన్నారన్న సంకేతాలు వెలువడ్డాయి. గల్వాన్ ఘర్షణల చేదు జ్ఞాపకాలను మరిచి, వాస్తవాధీన రేఖ వద్ద శాంతిని నెలకొల్పేందుకు, ఆర్థిక, దౌత్య మార్గాలను పునరుద్ధరించేందుకు భారత్ సుముఖత చూపింది.

ఈ ఘట్టం ఏ పరిణామాల్ని సూచిస్తోంది? చైనాతో కొన్ని దశాబ్దాలుగా నెలకొన్న శత్రుత్వ వాతావరణం మారనుందా? భారత్--చైనా సంబంధాల పునరుద్ధరణ అనేది దౌత్యపరమైన విజయానికంటే వ్యూహాత్మక రాజీని సూచిస్తోందా? అని కాంగ్రెస్ పార్టీ ప్రశ్నించింది. రాజీ అనడం కన్నా ప్రస్తుత అల్లకల్లోల అంతర్జాతీయ వాతావరణంలో అదొక చారిత్రక అవసరం కూడా కావచ్చని మరికొందరు భావిస్తున్నారు. ఈ సమావేశంలో భారత్, చైనాల మధ్య అత్యంత ముఖ్యమైన ఏకాభిప్రాయం ఏర్పడిందని, వ్యూహాత్మక, దీర్ఘకాలిక, దిశానిర్దేశం చేసే అంశాలపై ఇరువురు నేతలు స్పష్టమైన, లోతైన చర్చలు జరిపారని చైనా విదేశాంగ మంత్రి, కమ్యూనిస్టు పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వాంగ్ యీ అనడం విస్మరించదగిన విషయం కాదు. బ్రిక్స్ సమావేశాలు మారుతున్న ప్రపంచ వ్యవస్థను, అంతర్జాతీయ సంబంధాల మార్పును సూచిస్తున్నాయని అమెరికన్ మీడియా వ్యాఖ్యానించింది. అమెరికాతో ఉద్రిక్తతలు ఉన్న ఇరాన్‌కు బ్రిక్స్‌లో ప్రముఖ స్థానం లభించడం గ్లోబల్ ఆర్డర్‌లో మారుతున్న సమీకరణాలకు అద్దం పడుతోందని అమెరికా పత్రికలు ప్రత్యేకంగా విశ్లేషించాయి. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అనుసరించిన సుంకాల విధానాలే అంతర్గతంగా గణనీయమైన భేదాభిప్రాయాలు ఉన్న దేశాలను ఒకచోటకు చేర్చే అనుసంధానంగా (బైండింగ్ ఏజెంట్) పనిచేశాయని అమెరికన్ మీడియా భావించింది.

నిశితంగా విశ్లేషించాలంటే అమెరికాయే బ్రిక్స్‌కు సానుకూల పవనాలను (టెయిల్ విండ్) సృష్టించింది. వాషింగ్టన్ విధానాలు, అంతర్జాతీయ సంబంధాలు శాశ్వతంగా ఇలాగే ఉంటాయని చెప్పలేం. బహుళ ధ్రువ ప్రపంచంగా మారేందుకు, భద్రతా మండలి, ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంకు తీరుతెన్నుల్లో మార్పులు ఏర్పడేందుకు సమయం ఆసన్నమైందని, లేకపోతే బ్రిక్స్ మరింత బలమైన ప్రత్యామ్నాయ వ్యవస్థగా మారుతుందని చెప్పేందుకు ఆస్కారం ఏర్పడింది.

దేశ రాజకీయాల్లో కూడా తమ వ్యవహారశైలే ప్రత్యర్థుల బలాబలాలను నిర్ణయిస్తుందని బ్రిక్స్ సదస్సు నేపథ్యంలో పాలక పక్షం నేతలు గ్రహించాల్సిన అవసరం ఉన్నది. ట్రంప్ ధాటితో పలు దేశాలు ఏకమైనట్లు గడచిన కొన్ని సంవత్సరాలుగా ప్రధానమంత్రి మోదీ, ఆయన కుడిభుజం అమిత్ షా ధాటికి తట్టుకోలేక ప్రత్యర్థి శక్తులన్నీ ఏకమయ్యేందుకు ప్రయత్నిస్తున్నాయి. తాజాగా ఉమ్మడి పౌరస్మృతిపై ఎన్డీఏ మిత్రపక్షాలు కూడా అసమ్మతి ప్రకటిస్తున్నాయి. తన 25 సంవత్సరాల పాలన పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకుని

## మాజీ ఎమ్మెల్యే కుటుంబం దీనగాథ తెలిశాక నా మనసు చలించింది: సీఎం రేవంత్‌రెడ్డి

మొదటి పేజీ తరువాయి

సూర్యాపేట: సూర్యాపేట జిల్లా సిరికొండలో దివంగత మాజీ ఎమ్మెల్యే, ప్రముఖ కమ్యూనిస్టు నేత ఉప్పల మల్సూర్ కుటుంబ సభ్యులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసినట్లు సీఎం రేవంత్‌రెడ్డి ఎక్స్'లో పోస్టు చేశారు. ఉప్పల మల్సూర్ నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిచి ప్రజల గొంతుకగా నిలిచారని.. రజాకార్ల నిరంకుశత్వానికి ఎదురొడ్డి పోరాడారని గుర్తుచేశారు. "జీవితాంతం ప్రజల కోసమే పరితపించిన మల్సూర్ కుటుంబం నేడు నిలువనీడ కోసం ఎదురుచూస్తున్న విషయం తెలుసుకొని నా మనసు చలించిపోయింది. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కల్వకుంట్ల కుటుంబం ప్రజల సొమ్మును దోచుకుని ఫామ్‌హౌస్‌లు నిర్మించుకుంది తప్ప.. పేదలకు ఇళ్లు నిర్మించలేదని చెప్పడానికి ఉప్పల మల్సూర్ కుటుంబం దీనగాథే నిదర్శనం. ఈ రోజు పత్రికల్లో వచ్చిన కథనాన్ని చూసిన వెంటనే అధికారులను ఆదేశించి, ఉప్పల మల్సూర్ కోడళ్లు ఉప్పల పుష్పలత, యశోద పేర్లపై రెండు ఇందిరమ్మ ఇళ్లను తక్షణమే మంజూరు చేశాం. వాటి మంజూరుకు సంబంధించిన ప్రొసీడింగ్స్ ప్రతులను జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ స్వయంగా కుటుంబ సభ్యులకు అందజేశారు. ప్రతి పేదవాడి సొంతింటి కలను నెరవేర్చడమే ఇందిరమ్మ ప్రభుత్వం లక్ష్యం" అని రేవంత్‌రెడ్డి తెలిపారు.

## గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలు.. ఓటరు జాబితా షెడ్యూల్ విడుదల

మొదటి పేజీ తరువాయి

హైదరాబాద్: తెలంగాణలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు జాబితా షెడ్యూల్ విడుదలైంది. మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్, వరంగల్-ఖమ్మం-నల్గొండ ఎమ్మెల్సీ నియోజకవర్గాల ఓటరు జాబితాను ఈసీ విడుదల చేసింది. పట్టభద్రుల ఓట్ల నమోదు కోసం ఈ నెల 20న ఎన్నికల కమిషన్ పబ్లిక్ నోటీసు ఇవ్వనుంది. నవంబరు 6 వరకు ఓటరు దరఖాస్తులు స్వీకరించనుంది. నవంబరు 25న ముసాయిదా ఓటరు జాబితా విడుదల చేయనుంది. నవంబరు 25 నుంచి డిసెంబరు 10 వరకు అభ్యంతరాలు స్వీకరించనుంది. డిసెంబరు 30న పట్టభద్రుల తుది ఓటర్ల జాబితా విడుదల చేయనున్నారు.గతంలో ఓటున్న వారు కూడా మళ్లీ కొత్తగా దరఖాస్తు చేసుకోవాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి(సీఈవో) తెలిపారు. మార్చిలో ఎమ్మెల్సీలు వాణిదేవి, తీన్మార్ మల్లన్న పదవీ కాలం ముగియనుంది.

## విశాఖ స్టీల్ ప్లాంట్ నివాసయోగ్య ప్లాట్ల వేలానికి పచ్చజెండా

మొదటి పేజీ తరువాయి

అమరావతి: విశాఖ స్టీల్ ప్లాంట్‌కు చెందిన నివాసయోగ్య ప్లాట్లు వేలం ద్వారా విక్రయించనున్నారు. ఈ-వేలం ప్రక్రియ ద్వారా విక్రయానికి నేషనల్ లాండ్ మానిటైజేషన్ కార్పొరేషన్ షెడ్యూల్‌ను ప్రకటించింది. దీని ప్రచారం కోసం ఈ నెల 23న విశాఖలో, 24న విజయవాడలో, 25న హైదరాబాద్‌లో పెట్టుబడిదారుల సమావేశాలు నిర్వహిస్తామని ప్రకటించింది. విశాఖలోని హెచ్‌బీ కాలనీ, మద్దిలపాలెం, ఆటో నగర్, గాజువాకలో 93,572.21 చదరపు గజాల విస్తీర్ణంలో ఉన్న 459 ప్లాట్లు విక్రయించనున్నారు. సుమారుగా ఒక్కో ప్లాట్ విస్తీర్ణం 128.94 చదరపు గజాల నుంచి 2,728 చదరపు గజాల వరకు ఉంది.ఈ ప్రక్రియ కోసం క్వికర్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ లావాదేవీల సలహాదారుగా నియమించారు. ఈ-వేలం రైల్‌టెల్ ఇ-నివిడా ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫామ్ ద్వారా రెండు విడతల్లో నిర్వహిస్తారు. 243 ప్లాట్లకు అక్టోబర్ 12 తొలి వేలం జరుగుతుంది. దీనికి రిజిస్ట్రేషన్ ఎర్నెస్ట్ మనీ డిపాజిట్ సమర్పించడానికి చివరి తేదీ అక్టోబర్ 8 సాయంత్రం 5:00 గంటల వరకు గడువు ఇచ్చారు. 216 ప్లాట్లకు అక్టోబర్ 16న రెండవ విడత వేలం నిర్వహిస్తారు. దీనికి రిజిస్ట్రేషన్ సమర్పించడానికి చివరి తేదీ అక్టోబర్ 14గా నిర్ణయించారు. ఒక్కో ప్లాట్‌కు ఎర్నెస్ట్ మనీ డిపాజిట్ రూ. 2లక్షలుగా నిర్ణయించారు.

## రాత పరీక్ష ద్వారానే వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ పోస్టుల భర్తీ

మొదటి పేజీ తరువాయి




అమరావతి: రాష్ట్రంలో ఏపీపీఎస్సీ ద్వారా వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ పోస్టుల భర్తీకి రాత పరీక్షను తప్పనిసరి చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఏపీపీఎస్సీ ద్వారా నియామకం కోసం నోటిఫికేషన్ విడుదలైన తర్వాత వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ పోస్టుల భర్తీ ప్రక్రియ ప్రారంభం కానుంది. సుదీర్ఘకాలంగా అనుసరిస్తున్న మెరిట్ ప్రాతిపదికన వెయిటేజ్ పద్ధతిని కాకుండా రాత పరీక్ష ద్వారా నియామక ప్రక్రియ చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. మెరిట్ ఆధారంగా నియామక ప్రక్రియ ఉండాలని ఈనెల 13, 14న జారీ చేసిన ఉత్తర్వులు

## దేశ వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటే ఏం జరుగుతుందో ప్రధాని చూపించారు: చంద్రబాబు

మొదటి పేజీ తరువాయి

వారణాసి: భారత్ అభివృద్ధి చెందిన దేశంగా మారబోతోందని.. దీన్ని ఎవరూ ఆపలేరని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. వారణాసిలో నిర్వహించిన సేవా సంకల్ప్ అభియాన్‌లో ఆయన మాట్లాడారు. "దేశంలో 80 కోట్ల మందికి ఉచిత రేషన్ బియ్యం పంపిణీ జరుగుతోంది. ప్రధాని నరేంద్ర మోదీ పాలనలో 25 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారు. ప్రతి పేదవాడికి తాగునీరు అందించాలనేదే ప్రధాని లక్ష్యం. సుమారు 11 కోట్ల మంది పీఎం కిసాన్ ద్వారా లబ్ధి పొందుతున్నారు. మధ్యవర్తులు లేకుండా రైతుల ఖాతాల్లోనే డబ్బులు జమ అవుతున్నాయి.కొవిడ్ సంక్షోభంలోనూ ప్రధాని మోదీ మంచి పాలన అందించారు. ఆ సమయంలో 140 కోట్ల మందిని ఆయన కాపాడారు. ఉచితంగా దేశ ప్రజలకు కొవిడ్ వ్యాక్సిన్లు వేశారు. ప్రపంచంలోని 101 దేశాలకు కొవిడ్ వ్యాక్సిన్లు పంపారు. గతంలో భారత్ ఆయుధాలను దిగుమతి చేసుకునేది. ప్రస్తుతం దేశంలోనే ఆయుధాల ఉత్పత్తి జరుగుతోంది. టెక్నాలజీని అర్థం చేసుకున్న ఏకైక ప్రధాని మోదీనే. మహిళలే కేంద్రంగా దేశంలో అభివృద్ధి జరుగుతోంది. బేటీ బచావో.. బేటీ పడావో, ఉజ్వల సహా తదితర పథకాల ద్వారా మహిళా సాధికారత సాధ్యమవుతోంది. మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు ఇచ్చేందుకు చట్టం చేశారు. భారత అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటే ఏం జరుగుతుందో ప్రధాని చూపించారు. ఆపరేషన్ సిందూర్ ద్వారా భారత్ సత్తాను ప్రపంచానికి చాటిచెప్పారు. దేశంలో తీవ్రవాదం లేకుండా చర్యలు చేపట్టారు. సుదీర్ఘకాలం నలిగిన అయోధ్య సమస్యను పరిష్కరించారు" అని చంద్రబాబు కొనియాడారు.

## అమెరికా నుంచి 100% టారిఫ్ ముప్పు.. భారత్ రియాక్షన్ ఇదే

మొదటి పేజీ తరువాయి

రష్యా నుంచి చమురు కొనుగోలు చేసే దేశాల ఎగుమతులపై 100 శాతం టారిఫ్‌లకు వీలుకల్పించే బిల్లుకు అమెరికా చట్టసభల్లో ఆమోదం లభించింది. దీనిపై అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంతకం చేస్తే.. భారత్‌పై నూరుశాతం సుంకాలు పడే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం స్పందించింది. ఈ ఆంక్షల బిల్లును ఎప్పటికప్పుడు గమనిస్తున్నామని వెల్లడించింది."గతంలో చెప్పినట్టుగానే భారత్ తన 140 కోట్లమంది ప్రజలకు ఇంధన భద్రతను కల్పించడానికి కట్టుబడి ఉంది. మారుతున్న మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా వేర్వేరు వనరుల నుంచి ఇంధన దిగుమతులను కొనసాగిస్తాం. రష్యాతో చమురు వాణిజ్యం అంశంపై అమెరికా ప్రతినిధులతో ఇప్పటికే చర్చించాం. ద్వైపాక్షిక సంబంధాలపై మాత్రమే కాకుండా అంతర్జాతీయ ఇంధన మార్కెట్ల స్థిరత్వంపై కూడా ఈ బిల్లు ప్రభావం చూపించే అవకాశం ఉందని స్పష్టంగా తెలియజేశాం.భారత వాణిజ్య, ఆర్థిక ప్రయోజనాలను పరిరక్షించుకోవడానికి అవసరమైన అన్ని చర్యలను భారత ప్రభుత్వం తీసుకుంటుందని యూఎస్‌కు ఇప్పటికే చెప్పాం. ఈ బిల్లు చట్టరూపం దాల్చితే భారత వాణిజ్యంపై పడే ప్రభావాలను ఎదుర్కొనేందుకు సంబంధిత సంస్థలతో కలిసి పనిచేస్తున్నాం" అని కేంద్ర విదేశాంగ శాఖ ఒక ప్రకటనలో వెల్లడించింది.

## 25 ఏళ్ల నిస్వార్థ సేవ.. మోదీకి పుట్టినరోజు శుభాకాంక్షల వెల్లువ



మొదటి పేజీ తరువాయి

ప్రధాని మోదీ హయాంలో దేశం ఎన్నో నూతన ప్రమాణాలను నెలకొల్పిందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము కొనియాడారు. నేడు ప్రధాని పుట్టినరోజు సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. 25ఏళ్లుగా మోదీ చేసిన ప్రజా సేవలను ప్రస్తావిస్తూ సినీ, రాజకీయ ప్రముఖులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. "ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి హృదయపూర్వక పుట్టినరోజు శుభాకాంక్షలు. గడిచిన 25 ఏళ్లలో ముఖ్యమంత్రిగా, ప్రధానమంత్రిగా సుపరిపాలనను అందించారు. ఎన్నో నూతన ప్రమాణాలను నెలకొల్పారు. ఈ ప్రజా సేవను మరింతకాలం కొనసాగించేలా మీరు ఆరోగ్యంగా ఉండాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నా" - రాష్ట్రపతి ద్రౌపది ముర్ము "కర్తవ్యాన్నే సాధనగా, దేశసేవనే జీవిత ధ్యేయంగా మలుచుకుని సాగుతున్న మోదీ జీవితం కోట్ల మందికి స్ఫూర్తి. మీ నాయకత్వంలో దేశం ప్రగతిపథంలో నూతన శిఖరాలను అధిరోహించాలని.. 2047 నాటికి 'వికసిత భారత్' లక్ష్యాన్ని సాధించే దిశగా ముందుకు సాగాలని దేవుడిని ప్రార్థిస్తున్నాను" - కేంద్ర హోంమంత్రి అమిత్ షా

# గణేష్ శోభాయాత్రకు పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేయాలి: ఎస్పీ మహేష్ బి. గితే

- డయల్-112 కాల్స్‌పై వెంటనే స్పందించాలని ఆదేశం
- వేములవాడ టౌన్ పోలీస్ స్టేషన్ ఆకస్మిక తనిఖీ



వేములవాడ / సెప్టెంబర్ 17 ప్రజాదివాస్

గణేష్ శోభాయాత్ర, నిమజ్జన కార్యక్రమాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే అధికారులను ఆదేశించారు. గురువారం వేములవాడ పట్టణ పోలీస్ స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి, కేసుల దర్యాప్తు, స్టేషన్ రికార్డులు, సిబ్బంది హాజరు, నేరాల నియంత్రణ చర్యలను సమీక్షించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, ప్రజలకు పోలీస్ సేవలు మరింత చేరువయ్యేలా అధికారులు, సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సూచించారు. డయల్-112కు వచ్చే కాల్స్‌పై తక్షణమే స్పందించి, వీలైనంత త్వరగా సంఘటన స్థలానికి చేరుకుని బాధితులకు చట్టపరమైన సహాయం అందించాలని ఆదేశించారు. పట్టణ ప్రాంతాల్లో విజిబుల్ పోలీసింగ్‌ను మరింత సమర్థవంతంగా అమలు చేయాలని, బ్లూకోల్ట్, పెట్రోకార్ సిబ్బంది నిరంతర పెట్రోలింగ్ నిర్వహించాలని సూచించారు. రౌడీషీటర్లు, హిస్టరీషీటర్లు, పాత నేరస్తులు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై నిరంతరం నిఘా కొనసాగించాలని ఆదేశించారు. ఈ నెల 23న నిర్వహించనున్న గణేష్ శోభాయాత్ర, నిమజ్జన కార్యక్రమాల కోసం ముందస్తు భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. ఉత్సవ నిర్వాహకులతో సమన్వయం చేసుకుని రూట్ మ్యాప్, ట్రాఫిక్ నియంత్రణ, నిర్దేశిత సమయానికి నిమజ్జనం పూర్తయ్యేలా అవగాహన కల్పించాలని తెలిపారు. గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా సోషల్ మీడియాపై నిఘా కఠినతరం చేయాలని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే పోస్టులు చేసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. నిమజ్జన సమయంలో డీజేలకు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతి లేదని, నిబంధనలు ఉల్లంఘించిన నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. తనిఖీ కార్యక్రమంలో డీఎస్పీలు శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, సీఐలు వీరప్రసాద్, శ్రీనివాస్, ఎస్ఐలు ప్రేమానందం, శ్రీనివాస్, రాహుల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# చందుర్తిలో తెలంగాణ విమోచన దినోత్సవం.. ప్రధాని మోదీ పుట్టినరోజు వేడుకలు

-కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్న నాయకులు
-అమరుల త్యాగాలు గర్వకారణం: అల్లాడి రమేష్
-ప్రధాని నరేంద్ర మోదీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన చందుర్తి నాయకులు

చందుర్తి మండలం / సెప్టెంబర్ 17 ప్రజాదివాస్

చందుర్తి మండల కేంద్రంలో తెలంగాణ విమోచన దినోత్సవాన్ని మరియు భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 76వ పుట్టినరోజు వేడుకలను బిజెపి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా బిజెపి రాష్ట్ర నాయకులు అల్లాడి రమేష్ మాట్లాడుతూ.. "తెలంగాణ ప్రజల దశాబ్దాల కల నెరవేరిన సెప్టెంబర్ 17 తెలంగాణ విమోచన దినోత్సవం సందర్భంగా ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలిపారు. రజాకార్ల అరాచకాల నుంచి విముక్తి పొంది భారత యూనియన్‌లో కలిసిన ఈ చారిత్రాత్మక రోజు మనందరికీ గర్వకారణం అన్నారు. అమరుల త్యాగాలను స్మరించుకోవాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందన్నారు. అలాగే, దేశాన్ని అభివృద్ధి పథంలో ముందుకు నడిపిస్తూ ప్రపంచ దేశాల్లో భారత్ కీర్తిని చాటుతున్న ప్రధాని నరేంద్ర మోదీకి 76వ జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్నాం అన్నారు. వారు నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ప్రార్థిస్తున్నాం" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో అల్లాడి రమేశ్, మొకిలె విజయేందర్, మార్తా సత్తయ్య, పొనిశెట్టి రాకేష్, మర్రి మల్లేశం, పెరుక గంగరాజు, చింతకుంట సాగర్, రాజశేఖర్, చారి, మట్కమ్ మల్లేశం, పాటి సుధాకర్, తిరుమల్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, జలగం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.




# తెలంగాణ అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ ఘనంగా విమోచన దినోత్సవ వేడుకలు



ఇల్లంతకుంట మండలం / సెప్టెంబర్ 17 ప్రజాదివాస్

రాజన్న సిరిసిల్ల జిల్లా ,ఇల్లంతకుంట మండలం, తాళ్లపల్లి గ్రామంలో తెలంగాణ విమోచన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సర్పంచ్ సింగిరెడ్డి రచన వెంకటరాంరెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణ విమోచన కోసం పోరాడిన అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని అన్నారు. వారి పోరాట స్ఫూర్తిని నేటి యువత ఆదర్శంగా తీసుకుని సమాజ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణ చరిత్రను భావితరాలకు తెలియజేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు. ఉపసర్పంచ్ రామస్వామి మాట్లాడుతూ తెలంగాణ విమోచన దినోత్సవం ప్రజాస్వామ్య విలువలను గుర్తు చేసే చారిత్రక సందర్భమని తెలిపారు. గ్రామాభివృద్ధితో పాటు జాతీయ భావాలను పెంపొందించే కార్యక్రమాల్లో ప్రజలు చురుకుగా పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, గ్రామ పంచాయతీ కార్యదర్శి, గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు, విద్యార్థులు మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు. అనంతరం తెలంగాణ అమరవీరులకు నివాళులర్పించి వారి సేవలను స్మరించుకున్నారు

# వేములవాడలో ఘనంగా తెలంగాణ విలీన దినోత్సవం: అమరులకు ఘన నివాళి

-నైజాం వ్యతిరేక పోరాట యోధుల త్యాగాలు అమూల్యం: ఉద్యమకారులు
-విలీన దినోత్సవాన్ని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలి: ఎల్లపోశెట్టి డిమాండ్
-తెలంగాణ ఉద్యమకారులను ప్రభుత్వం తక్షణమే గుర్తించి ఆదుకోవాలి: వారాల దేవయ్య

వేములవాడ / సెప్టెంబర్ 17 ప్రజాదివాస్

వేములవాడలోని స్థానిక తెలంగాణ అమరవీరుల స్తూపం వద్ద గురువారం తెలంగాణ విలీన దినోత్సవాన్ని ఉద్యమకారులు, ఉద్యమ కళాకారులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమరవీరుల స్తూపానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఉద్యమకారుడు బొజ్జ కనకయ్య మాట్లాడుతూ... నైజాం సర్కార్‌తో పాటు భూస్వాములు, దొరల దోపిడీకి వ్యతిరేకంగా పోరాడి అమరులైన యోధుల త్యాగాలు అమూల్యమైనవని కొనియాడారు. వారి పోరాటాల ఫలితంగానే పేదలు, రైతులు, కూలీలకు స్వేచ్ఛ లభించిందని, ఆ మహనీయుల త్యాగాలను ఎప్పటికీ మరవకూడదని పేర్కొన్నారు. అనంతరం విక్కుర్తి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ... తెలంగాణ విమోచన పోరాటంలో రావి నారాయణరెడ్డి, మాడపాటి హనుమంతరావు, ధర్మభిక్షం, మల్లు స్వరాజ్యం, అనభేరి ప్రభాకర్ వంటి యోధులు మడమ తిప్పని పోరాటం చేశారని గుర్తుచేశారు. కళాకారుల సంఘం అధ్యక్షుడు ఎల్లపోశెట్టి మాట్లాడుతూ... తెలంగాణ విలీన దినోత్సవాన్ని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని, ఆ రోజున ఉద్యమకారులను ఘనంగా సన్మానించాలని కోరారు. వారాల దేవయ్య మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర సాధన పోరాటంలో భాగస్వాములైన ఉద్యమకారులను ప్రభుత్వం తక్షణమే గుర్తించి, అన్ని విధాలా సహాయ సహకారాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కళాకారులు అమరుల స్మారక గీతాలను ఆలపించారు. కార్యక్రమంలో లాల దేవయ్య, గజ్జల రమేష్, కనపర్తి హనుమాన్లు, వెదురు రవి తదితరులు పాల్గొన్నారు.



# సిరిసిల్ల జిల్లా పోలీస్ కార్యాలయంలో వైభవంగా ప్రజాపాలన దినోత్సవం

జాతీయ జెండాను ఆవిష్కరించిన జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే

రాజన్న సిరిసిల్ల జిల్లా / సెప్టెంబర్ 17 ప్రజాదివాస్

రాజన్న సిరిసిల్ల జిల్లా పోలీస్ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర ప్రజాపాలన దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే ఐపీఎస్ జాతీయ జెండాను ఆవిష్కరించి పోలీసు బలగాల గౌరవ వందనం స్వీకరించారు. ప్రజాపాలన దినోత్సవ ప్రాధాన్యతను వివరిస్తూ ప్రజలకు, పోలీస్ సిబ్బందికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డిఎస్పీలు నాగేంద్రచారి, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లుతో పాటు పలువురు సీఐలు, ఎస్ఐలు, కార్యాలయ సిబ్బంది మరియు పోలీస్ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# శభాష్‌పల్లిలో ఘనంగా జాతీయ జెండా ఆవిష్కరణ: పాల్గొన్న సర్పంచ్ ఎ.టి. యాదవ్

గ్రామాభివృద్ధితో పాటు ప్రజల ఆరోగ్యమే ధ్యేయం: జిల్లా సర్పంచుల ఫోరం అధ్యక్షుడు

వేములవాడ / సెప్టెంబర్ 17 ప్రజాదివాస్



వేములవాడ అర్బన్ మండల పరిధిలోని శభాష్‌పల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో గురువారం జాతీయ జెండాను ఘనంగా ఆవిష్కరించారు. సర్పంచ్, జిల్లా సర్పంచుల ఫోరం అధ్యక్షుడు ఎ.టి. యాదవ్ పాల్గొని జాతీయ పతాకాన్ని ఎగరవేశారు. ఈ సందర్భంగా గ్రామంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించడంతో పాటు పాఠశాల విద్యార్థులకు యూనిఫాంలను పంపిణీ చేశారు. అనంతరం సర్పంచ్ ఎ.టి. యాదవ్ మాట్లాడుతూ... గ్రామాభివృద్ధితో పాటు ప్రజల ఆరోగ్యం, విద్యార్థుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నామని తెలిపారు. ఉచిత వైద్య శిబిరాలను గ్రామీణులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు మౌలిక వసతుల కల్పనకు తమ వంతు కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ ప్రజాప్రతినిధులు, వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# చంద్రగిరిలో ఘనంగా ప్రజా పాలన దినోత్సవం

-ప్రజా పాలన వేడుకల్లో పాల్గొన్న సర్పంచ్ ముత్త సంజన మహేష్
-ప్రజల భాగస్వామ్యంతోనే గ్రామాభివృద్ధి సాధ్యం: సర్పంచ్ సంజన



వేములవాడ / సెప్టెంబర్ 17 ప్రజాదివాస్

వేములవాడ అర్బన్ మండలం చంద్రగిరి గ్రామంలో తెలంగాణ ప్రజా పాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తాత్కాలిక గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ ముత్త సంజన మహేష్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. "తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం సందర్భంగా చంద్రగిరి గ్రామ ప్రజలందరికీ శుభాకాంక్షలు. ప్రజల భాగస్వామ్యంతోనే గ్రామాభివృద్ధి సాధ్యమవుతుంది. పంచాయతీ ద్వారా నిరంతరం మెరుగైన సేవలు అందిస్తూ, గ్రామాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లేందుకు మా పాలకవర్గం శాయశక్తులా కృషి చేస్తుంది. గ్రామ సమస్యల పరిష్కారానికి, సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందించడానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటాం" అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ నిట్టు నరేష్, వార్డు సభ్యులు పూసాల సంతోష్, ఎడెల్లి లక్ష్మి, ఎడెల్లి సుదర్శన్, మాజీ సర్పంచ్ గర్రెపల్లి వెంకటి గౌడ్, నాయకులు ఎడెల్లి మల్లయ్య, దుద్దెటి సంజీవ్, తాటకార్ల ఇస్తారి, పోతార్ల అరుణ్, మంద అనిల్ కుమార్, పోతార్ల వంశీ,-ూచీవీ శంకరవ్వ, అంగన్వాడీ టీచర్ మంద పద్మ మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# వేములవాడ భీమన్న సన్నిధిలో ఆస్కార్ విజేత చంద్రబోస్ ప్రత్యేక పూజలు

వేములవాడ / సెప్టెంబర్ 17 ప్రజాదివాస్



రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన వేములవాడ భీమన్న స్వామివారి అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామివారిని ప్రముఖ సినీ గేయ రచయిత, ఆస్కార్ అవార్డు గ్రహీత కనకండ్ల సుభాష్ చంద్రబోస్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఇటీవల వివాహమైన తన కుమారుడు, కోడలితో కలిసి విచ్చేసిన ఆయన.. కోడె మొక్కు చెల్లించుకుని, అభిషేకం, నిత్య కల్యాణ సేవల్లో పాల్గొన్నారు. పూజల అనంతరం వేద పండితులు ఆశీర్వచనం అందించగా, ఆలయ ఈవో రమాదేవి స్వామివారి శేషవస్త్రం, ప్రసాదాలతో సత్కరించారు. ఈ సందర్భంగా చంద్రబోస్ మాట్లాడుతూ రాజరాజేశ్వర స్వామి తమ ఇలవేల్పు, కులదైవమని తెలిపారు. చిన్నతనంలో తల్లిదండ్రులతో వచ్చిన జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ, కుమారుడి వివాహం తర్వాత ఆనవాయితీ ప్రకారం మొక్కులు చెల్లించుకోవడానికి రావడం ఆనందంగా ఉందన్నారు. సినీ రంగంలో 31 ఏళ్ల ప్రస్థానంలో 3,800కు పైగా పాటలు రాశానని, త్వరలోనే వేములవాడ రాజన్న క్షేత్ర విశిష్టతపై ఒక అద్భుతమైన భక్తి గీతాన్ని రచిస్తానని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఆయన కుటుంబ సభ్యులు, ఆలయ అధికారులు పాల్గొన్నారు

# పలు గ్రామాల్లో భూముల రిసర్వే గ్రామసభలు

- రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎం ఆర్ ఓ పారుక్

ముస్తాబాద్/ సెప్టెంబర్ 17 ప్రజా దివాస్



తెలంగాణ రాష్ట్ర ప్రజా పాలన ప్రభుత్వం రైతుల భూముల రీ సర్వే కార్యక్రమాన్ని ముస్తాబాద్ మండలంలోని గూడూరు మొఱాయిపల్లి తెర్లుమద్ది మొర్రపూర్ గ్రామాలలో భూముల రిసర్వే గ్రామసభలు నిర్వహిస్తున్నామని ముస్తాబాద్ తహసిల్దార్ ఫారుక్ తెలిపారు ఈ కార్యక్రమానికి రైతులు అధిక సంఖ్యలో హాజరై పలు గ్రామాల్లో భూముల రిసర్వే గ్రామసభలు

# అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి పచ్చి అబద్ధాలు మాట్లాడారు: కొండూరు రవీందర్ రావు

**-సిరిసిల్లలో 8 వేల ఎకరాల కబ్జాలపై శ్వేతపత్రం విడుదల చేయాలి: బీఆర్ఎస్ సవాల్**

**-ఆరోపణలు నిరూపిస్తే ముక్కు నేలకు రాస్తాం: బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య**

**-సీఎం రేవంత్ రెడ్డిపై న్యాయపోరాటం, పరువు నష్టం దావా వేస్తాం: న్యాఫ్స్కాబ్ చైర్మన్**

**-కాంగ్రెస్ ప్రభుత్వం కక్షపూరితంగానే భూములను లాక్కుంటోంది: విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ నేతలు**



రాజన్న సిరిసిల్ల జిల్లా / సెప్టెంబర్ 17 ప్రజాదివాస్

శాసనసభ వేదికగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పచ్చి అబద్ధాలు మాట్లాడారని, బీఆర్ఎస్ నేతలపై చేసిన ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నామని న్యాఫ్స్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్ రావు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య మండిపడ్డారు. గురువారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని తెలంగాణ భవన్‌లో పలువురు ముఖ్య నాయకులతో కలిసి వారు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాఫ్స్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్ రావు మాట్లాడుతూ... తమ కుటుంబానికి స్వాతంత్ర్యానికి పూర్వం నుంచే భూములు ఉన్నాయని, కేసీఆర్ హయాంలో లేదా బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత తమకు ఒక్క గుంట భూమి పణ పెరగలేదని స్పష్టం చేశారు. కేసీఆర్, కేటీఆర్‌లను రాజకీయంగా ఎదుర్కొలేక తమను పావులుగా వాడుకుంటూ అసత్య ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డి చేసిన ఆరోపణలపై చట్టపరంగా న్యాయపోరాటం చేస్తామని, అవసరమైతే పరువు నష్టం దావా వేస్తామని హెచ్చరించారు. సిరిసిల్లలో 8,000 ఎకరాలు కబ్జా చేశారని అంటున్న ప్రభుత్వం, దానిపై వెంటనే శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య మాట్లాడుతూ... రేవంత్ రెడ్డి అసెంబ్లీలో సిరిసిల్ల భూములపై అవాస్తవాలు మాట్లాడారని అన్నారు. 2009 నుంచి కేటీఆర్ ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో అసైన్‌మెంట్ కమిటీ చైర్మన్‌గా అర్హులైన నిరుపేదలకు చట్టబద్ధంగా కేటాయించిన భూములు మొత్తం కలిపినా 1,500 ఎకరాలు దాటవని, మరి 8,000 ఎకరాలు ఎక్కడి నుంచి వచ్చాయని ప్రశ్నించారు. 26 ఏళ్ల క్రితం మాజీ నక్సలైట్ల పునరావాసం కింద అప్పటి టీడీపీ ప్రభుత్వం తనకు ఇచ్చిన 3.5 ఎకరాల భూమిని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక కక్షపూరితంగా లాక్కున్నారని ఆరోపించారు. సిరిసిల్లలో 8 వేల ఎకరాలు బీఆర్ఎస్ నేతలకు కట్టబెట్టినట్లు నిరూపిస్తే తాము అంబేద్కర్ విగ్రహం వద్ద ముక్కు నేలకు రాస్తామని, నిరూపించలేకపోతే సీఎం రేవంత్ రెడ్డి క్షమాపణ చెప్పాలని సవాల్ విసిరారు. ఈ విలేకరుల సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళా, పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ అకునూరి శంకరయ్య, నాయకులు కుంభాల మల్లారెడ్డి, బొల్లి రామ్మోహన్, గుండ్లపల్లి పూర్ణచందర్, పలువురు కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# వేములవాడ మార్కెట్ కమిటీలో ఘనంగా ప్రజా పాలన దినోత్సవం

**-రైతాంగ సంక్షేమమే మా ధ్యేయం: చైర్మన్ రొండి రాజు**

**-మార్కెట్ కమిటీ కార్యాలయంలో జాతీయ జెండా ఆవిష్కరించిన రొండి రాజు**

వేములవాడ / సెప్టెంబర్ 17 ప్రజాదివాస్



వేములవాడ మార్కెట్ కమిటీ కార్యాలయంలో తెలంగాణ ప్రజా పాలన దినోత్సవ వేడుకలను మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన జాతీయ జెండాను ఆవిష్కరించి జెండా వందనం సమర్పించారు. అనంతరం చైర్మన్ రొండి రాజు మాట్లాడుతూ.. "తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం సందర్భంగా రైతు సోదరులకు, ప్రజలందరికీ నా హృదయపూర్వక శుభాకాంక్షలు. రైతాంగ సంక్షేమమే ధ్యేయంగా మార్కెట్ కమిటీ నిరంతరం పనిచేస్తుంది. మార్కెట్‌కు వచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని రకాల వసతులు కల్పిస్తున్నాం. ప్రజా ప్రభుత్వంలో రైతులకు మద్దతు ధరతో పాటు, పారదర్శకమైన సేవలు అందించడానికి మా పాలకవర్గం ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుంది" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ అధికారులు, డైరెక్టర్లు, సిబ్బంది మరియు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేసిన గిరిజనులు...

**గిరిజనుల సంక్షేమ ప్రదాత కెసిఆర్**

వీర్నపల్లి సెప్టెంబర్ 17 ప్రజాదివాస్

రాజన్న సిరిసిల్ల జిల్లా లోని వీర్నపల్లి మండల కేంద్రం లో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ కుకృతజ్ఞతా పూర్వకంగా కెసిఆర్ ూవజ్ 30 నా +ూ 33 జారీ చేసి , దీనిని అనుసరించి రిజర్వేషన్ 6 నుంచి 10 శాతానికి పెంచి నాలుగు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా కెసిఆర్ సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసిన బంజారాలుఈ సందర్భంగా మాజీ జడ్పీటీసీ గుగులోత్ కళావతి సురేష్ నాయక్ , టిఆర్ఎస్ పార్టీ మండల మహిళా విభాగం అధ్యక్షురాలు గుగులోత్ కళా తిరుపతి నాయక్ లు మాట్లాడుతూ రిజర్వేషన్ పెరగడం వల్ల విద్య, ఉద్యోగ అవకాశాల్లో గిరిజనులకు ప్రాతినిధ్యం పెరిగిందన్నారు . కెసిఆర్ ప్రభుత్వం 3146 తండాలు, గూడెలను గ్రామపంచాయతీగా మార్చడంతో గిరిజన ప్రాంతాలకు గుర్తింపు లభించింది. దాదాపు 30 వేల మంది గిరిజన ప్రజాప్రతినిధులుగా ఎదిగారు. అంతేకాకుండా సుమారు 1.5 లక్షల గిరిజన రైతులకు నాలుగు లక్షల ఎకరాలకు పోడు భూములకు హక్కులు కల్పించారు. తెలంగాణ ఏర్పడక ముందు ఉమ్మడి ూూా లో కేవలం 10 గిరిజన గురుకులాలు మాత్రమే ఉండేవి. కెసిఆర్ ప్రభుత్వం ఏర్పడ్డ తర్వాత పది సంవత్సరాల కాలంలో 95 గిరిజన గురుకులాలను ఏర్పాటు చేశారు. గిరిజన విద్యార్థులు విదేశీ చదువులకు అంబేద్కర్ ఓవర్సీస్ విద్యానిధి ద్వారా 20 లక్షల వరకు ఆర్థిక సాయం అందించారు. గిరిజన అమ్మాయిలకు కళ్యాణ లక్ష్మి అందించారు. ఈ విధంగా కెసిఆర్ పాలన గిరిజనులకు ఒక స్వర్ణ యుగంలా ఉందన్నారు ఈ రోజు మండల



కేంద్రంలో తో పాటు అన్ని తండా గ్రామపంచాయతీలలో కెసిఆర్ గారి చిత్రపటానికి సంత్ సేవాలాల్ మహారాజ్ చిత్రపటానికి పాలాభిషేకం చేయడం జరిగింది అని పేర్కొన్నారు దీనితోపాటు జిల్లాలోని 33 గ్రామపంచాయతీలు

# ముస్తాబాద్ లో విశ్వకర్మ జయంతి కార్యక్రమం



ముస్తాబాద్/ సెప్టెంబర్ 17 ప్రజా దివాస్

రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాదు మండలంలో ఈరోజు విశ్వకర్మ జయంతి సందర్భంగా స్థానిక శివకేశ ఆలయ ప్రాంగణంలో మనుమయ సంఘము ముస్తాబాద్ సభ్యులు విశ్వకర్మ జయంతి జరుపుకోనైనది సభ్యులందరూ మాట్లాడుతూ విశ్వకర్మలు అంటే దివ్య ఆయుధాలు భవనాల కాకుండా విష్ణువు యొక్క గదా ఇంద్రుని వజ్రాయుధం మరియు అర్జునుడి గాండీవ ధనుస్సును కూడా విశ్వకర్మలు తయారు చేశారు పుష్పక విమానం కుబేరుడు కోసం ఆకాశంలో వివరించే స్టేజి మీద భవనం లాంటి పుష్పక విమానం ఆయన నే రూపొందించారు విశ్వకర్మ లు అంటే సృష్టికి మూలం అని అన్నారు .మన మాయ సంఘం సభ్యుల కుటుంబ సభ్యులతో మంగళ హారతులతో విశ్వకర్మ భగవాన్ పూజా కార్యక్రమంలో భక్తిశ్రద్ధలతో ఉత్సాహంగా పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించినైనది ఇట్టి కార్యక్రమంలో గ్రామ అధ్యక్షులు ఓరగంటి సత్యం చారి ఉపాధ్యక్షులు దుంపేట శ్రీనివాస చారి కార్యదర్శి ఓరగంటి నరసింహా చారి కోశాధికారి పొనగంటి బాల నర్సయ్య చారి అధ్యక్షులు పొనగంటి రఘువీరా చారి ప్రచార కార్యకర్త సురోజుల నరేంద్ర చారి కోడుమోజు మహేష్ చారి మహిళలు పొనగంటి సత్తెమ్మ ఉమారాణి దుంపేట శోభా వి అరుణ విజయ సురోజుల స్వప్న తదితరులు పాల్గొన్నారు

# వేములవాడ తెలంగాణ చౌక్‌లో మువ్వన్నెల పతాకావిష్కరణ

**-అమరవీరులకు ఘనంగా నివాళులర్పించిన బీఆర్ఎస్ నాయకులు**

**-తెలంగాణ ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీక సెప్టెంబర్ 17**



వేములవాడ / సెప్టెంబర్ 17 ప్రజాదివాస్

వేములవాడ పట్టణ కేంద్రంలోని తెలంగాణ చౌక్‌లో గురువారం తెలంగాణ విమోచన దినోత్సవ వేడుకలను బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ నాయకులు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, నాటి విమోచన పోరాటంలో ప్రాణాలర్పించిన అమరవీరుల త్యాగాలను స్మరిస్తూ ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మాట్లాడుతూ.. తెలంగాణ చరిత్రలో సెప్టెంబర్ 17వ తేదీ అత్యంత కీలకమైన, స్వర్ణాక్షరాలతో లిఖించదగిన రోజని కొనియాడారు. నిజాం రాచరిక పాలన, నిర్బంధాల నుంచి విముక్తి కోసం నాటి ప్రజలు, వీర యోధులు ప్రాణాలను సైతం లెక్కచేయకుండా చేసిన పోరాటాలు అమోఘమని పేర్కొన్నారు. అమరుల త్యాగాలు, వారి పోరాట స్ఫూర్తి నేటి తరానికి నిరంతరం మార్గదర్శకమని అన్నారు. తెలంగాణ పోరాట చరిత్రను, వీరుల త్యాగాలను భావితరాలకు సగర్వంగా తెలియజేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని స్పష్టం చేశారు. తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని, పోరాట పటిమను కాపాడుకుంటూ ముందడుగు వేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వేములవాడ పట్టణ బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, మున్సిపల్ ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు, యువజన, మహిళా విభాగాల నాయకులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# రుద్రంగిలో తెలంగాణ విమోచన దినోత్సవం.. మోదీ పుట్టినరోజు వేడుకలు

రుద్రంగి మండలం / సెప్టెంబర్ 17 ప్రజాదివాస్



రుద్రంగి మండల కేంద్రంలో బిజెపి పార్టీ ఆధ్వర్యంలో గురువారం తెలంగాణ విమోచన దినోత్సవం, ప్రధాని నరేంద్ర మోదీ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు కర్ణావత్తుల వేణు జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం వేణు మాట్లాడుతూ... అధికారంలోకి వచ్చాక సెప్టెంబర్ 17న తెలంగాణ విమోచన దినోత్సవాన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారికంగా జరుపుతామని చెప్పిన కాంగ్రెస్ పార్టీ, ఇప్పుడు మాట తప్పడం సరికాదని అన్నారు. ఎంఐఎం పార్టీకి భయపడే కాంగ్రెస్ ప్రభుత్వం విమోచన దినోత్సవాన్ని 'ప్రజాపాలన దినోత్సవం' పేరుతో జరుపుతోందని విమర్శించారు. కాంగ్రెస్ జరిపేది ప్రజాపాలన దినోత్సవం కాదని, అది 'ప్రజా వ్యతిరేక దినోత్సవం' అని ఎద్దేవా చేశారు. అనంతరం ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో ఆయన పేరిట ప్రత్యేక పూజలు నిర్వహించి, పండ్లు పంపిణీ చేశారు. ప్రధాని మోదీ ఆయురారోగ్యాలతో ఇలాంటి పుట్టినరోజు వేడుకలు మరెన్నో జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వేములవాడలో నరేంద్ర మోదీ జన్మదినం, తెలంగాణ విమోచన దినోత్సవం

వేములవాడ / సెప్టెంబర్ 17 ప్రజాదివాస్

స్థానిక పట్టణ బీజేపీ శాఖ ఆధ్వర్యంలో బుధవారం తెలంగాణ విమోచన దినోత్సవం, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాత ఆంధ్ర బ్యాంక్ సర్కిల్‌లో జాతీయ జెండాను ఆవిష్కరించి, జాతీయ గీతాన్ని ఆలపించారు. అనంతరం శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి ఆలయంలో స్వామివారికి కోడిమొక్కులు చెల్లించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాఠశాల విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేయడంతో పాటు ప్రధాని నరేంద్ర మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం భక్తులకు, ప్రజలకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షుడు రాపల్లి శ్రీధర్ మాట్లాడుతూ... సనాతన ధర్మ పరిరక్షణకు, ప్రపంచ దేశాల్లో భారతదేశ కీర్తి ప్రతిష్ఠలను అత్యున్నత స్థాయిలో నిలపడానికి కృషి చేస్తున్న మోదీకి రాజరాజేశ్వర స్వామివారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. పార్టీ నాయకుడు ప్రతాప రామకృష్ణ మాట్లాడుతూ... ప్రధాని మోదీని ఈ యుగపురుషుడిగా భావిస్తున్నామని, ఆయన ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. తెలంగాణలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ప్రజలను మోసం చేస్తున్నాయని, రానున్న రోజుల్లో తెలంగాణ ప్రజల ఆకాంక్షలను బీజేపీ మాత్రమే నెరవేరుస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ కుమ్మరి శంకర్, నాయకులు ముత్యం, కొండ్లెపు వంగల శ్రీనివాస్, మైలారం శ్రీనివాస్, రాష్ట్ర ఎస్సీ మోర్చా కార్యదర్శి సంటి మహేష్, లీగల్ సెల్ నాయకులు రేగుల రాజ్ కుమార్, కోల కృష్ణస్వామి, సంటి అంజిబాబు, రేగుల మల్లికార్జున్, పిన్నింటి హనుమాన్లు, రేగుల శ్రీకాంత్, మామిళ్ళ లక్ష్మీరాజ్యం, వివేక్ రెడ్డి, కటకం శ్రీనివాస్,



నామాల శేఖర్, గుడిసె మనోజ్, బిల్లా కృష్ణ, సగ్గు రాహుల్, చిక్కుడు మల్లేశం, మహంకాళి శ్రీనివాస్, యశ్వంత్, హరీష్, సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా పాలన దినోత్సవం సందర్భంగా జెండా ఆవిష్కరణ

ముస్తాబాద్/ సెప్టెంబర్17 ప్రజా దివాస్

తెలంగాణ రాష్ట్ర ప్రజా ప్రభుత్వం ఆదేశాల మేరకు ముస్తాబాద్ మండలంలోని తహసిల్దార్ కార్యాలయంలో ప్రజా పాలన దినోత్సవం సందర్భంగా జాతీయ జెండాను తహసిల్దార్ ఫారుక్ ఆవిష్కరించారు ఈ సందర్భంగా జాతీయ గీతాన్ని అలపించి విద్యార్థులకు నోటుబుక్కులను పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో ఫారుక్ డిప్యూటీ ఎమ్మార్వో అపర్ణ, ఆర్ ఐ రెవెన్యూ సిబ్బంది, జి పి ఓ లు పాల్గొన్నారు



# నూతన తహసీల్దార్ భవనానికి శంకుస్థాపన ఏది..?

**- మంజూరై రెండు నెలలైనా ముందుకు పడని అడుగులు**

**- అద్దె భవనంలోనే కొనసాగుతున్న పాలన**



ప్రజాదివాస్

నూతన మండలాల పునర్విభజనలో భాగంగా నిజాంపేట మండలం ఏర్పడి దాదాపు పదేళ్లు గడుస్తున్నా, నేటికీ మండలంలోని ప్రభుత్వ కార్యాలయాలకు శాశ్వత భవనాలు అందుబాటులోకి రాకపోవడంపై ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా తహసీల్దార్ కార్యాలయం అద్దె భవనంలో కొనసాగుతుండటంతో అధికారులు, ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.అరకొర సౌకర్యాలతో అద్దె భవనంలోనే..ప్రస్తుతం తహసీల్దార్ కార్యాలయం పాత పెంకుటిల్లులో అద్దెకు కొనసాగుతోంది. సరైన సౌకర్యాలు లేకపోవడంతో వివిధ పనుల కోసం కార్యాలయానికి వచ్చే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో అద్దె బకాయిలు చెల్లింపులో జాప్యం కారణంగా భవన యజమానులు కార్యాలయానికి తాళం వేసిన సందర్భాలు కూడా ఉన్నాయని స్థానికులు పేర్కొంటున్నారు.స్థల పరిశీలనకే పరిమితమైన కార్యాచరణ సుమారు రెండు నెలల క్రితం నూతన తహసీల్దార్ కార్యాలయ భవన నిర్మాణానికి నిధులు మంజూరైనట్లు మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు ప్రకటించారు. అనంతరం మెదక్ ఆర్డీవో రమాదేవి నిజాంపేట మండల కేంద్రంలో పలు స్థలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనుకూలమైన స్థలాన్ని ఎంపిక చేసి ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపిస్తామని అధికారులు తెలిపారు. అయితే స్థల పరిశీలన జరిగి రెండు నెలలు గడిచినా నిర్మాణానికి సంబంధించి తదుపరి చర్యలు కనిపించకపోవడంపై స్థానికులు ప్రశ్నిస్తున్నారు.త్వరితగతిన పనులు ప్రారంభించాలని డిమాండ్కేవలం ప్రకటనలు, స్థల పరిశీలనలకే పరిమితం కాకుండా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి నూతన తహసీల్దార్ కార్యాలయ నిర్మాణానికి శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించాలని మండల ప్రజలు కోరుతున్నారు. శాశ్వత భవనం అందుబాటులోకి వస్తే అధికారులు, సిబ్బందితో పాటు వివిధ పనుల కోసం వచ్చే ప్రజలకు మెరుగైన సౌకర్యాలు లభిస్తాయని వారు పేర్కొంటున్నారు

# తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం ఘనంగా నిర్వహణ

**- భద్రాద్రి కొత్తగూడెం పాల్వంచ రూరల్**

ప్రజాదివాస్

పాల్వంచ: పాల్వంచ గ్రామీణ ప్రాంతం యానంబైలు పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలంగాణ ప్రజాపాలన దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి. ప్రకాశ్‌రావు. జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

అనంతరం పాఠశాల సిబ్బంది తరపున రమణ సార్ విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం ప్రాముఖ్యతను, తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావానికి దారితీసిన పరిస్థితులను, రాష్ట్ర ప్రజల ఆకాంక్షలను విద్యార్థులకు వివరించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజల భాగస్వామ్యం, ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వాలు చేపడుతున్న కార్యక్రమాలు, పౌరుల బాధ్యతల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు తెలంగాణ చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలు, రాష్ట్ర అభివృద్ధిలో యువత మరియు విద్యార్థుల పాత్ర గురించి వివరించారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత లక్ష్యాలను సాధించి సమాజం మరియు రాష్ట్ర అభివృద్ధికి తమ వంతు సహకారం అందించాలని సూచించారు.కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. జాతీయ పతాకానికి గౌరవ వందనం సమర్పించి, తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా



ప్రజాస్వామ్య విలువలను కాపాడుతూ బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలని ప్రతిజ్ఞ చేశారు.పాఠశాల ఆవరణలో దేశభక్తి, తెలంగాణ రాష్ట్ర స్ఫూర్తిని ప్రతిబింబించేలా కార్యక్రమం ఉత్సాహభరితంగా సాగింది. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సిబ్బందిని పలువురు అభినందించారు.

# అరెస్ట్ చేసి చేతులు దులుపుకోవడం కాదు

**- ఉపా చట్టం నమోదు చేయాలి**

**- జేబీపీ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ యెర్రా కామేష్**



ప్రజాదివాస్

చుంచుపల్లి: హమారా ప్రసాద్ ను తూతూ మంత్రంగా అరెస్ట్ చేసి చేతులు దులుపుకోవడం కాదని,అతనిపై ఊపా చట్టం కింద కేసు నమోదు చేయాలని జైభీమ్ రావ్ భారత్ పార్టీ (జేబీపీ) స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ యెర్రా కామేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.గురువారం మండలంలోని ఫంక్షన్ హాల్ నందు జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత ప్రపంచ మేధావి అంబేద్కర్ గారిని ప్రపంచమంతా మేధావిగా గుర్తించి ఆయన జయంతిని వరల్డ్ నాలెడ్జి డే గా ప్రకటిస్తే అటువంటి మహనీయుడిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ,అంబేద్కర్ పై కల్పిత నాయకుడు పుస్తకాన్ని 18వ తేదీన ఆవిష్కరణ చేస్తానని ప్రకటించిన హమారా ప్రసాద పై గత కొంతకాలంగా తెలంగాణ రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో అంబేద్కర్ వాదులు రాజకీయ పార్టీల నాయకులు పలు పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదు చేసినా ప్రభుత్వం ముందే అరెస్టు చేయకపోవడం వల్ల సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో కల్పిత నాయకుడు పుస్తక ఆవిష్కరణకు పూనుకున్నాడని,ప్రభుత్వ అండదండలు లేకుండానే ఇంత సాహసానికి పూనుకున్నాడా అని ప్రశ్నించారు ఇన్ని రోజులు అరెస్ట్ చేయకుండా ఇప్పుడు ప్రభుత్వం అరెస్ట్ చేయడం కాదని అతనిపై ఊపా చట్టం కింద కేసు నమోదు చేసి బెయిల్ రాకుండా చేయాలని అంబేద్కర్ పై హమారా ప్రసాద్ అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నా కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు మౌనంగా ఉంటుందని ప్రశ్నించారు.ఆర్ఎస్ఎస్,బీజేపీ మతోన్మాదులు హమారా ప్రసాద్ తో అంబేద్కర్ కు వ్యతిరేకంగా మాట్లాడిస్తుంది వాస్తవం కదా అని నిలదీశారు.నిజంగా బీజేపీ వారికి సంబంధం లేకపోతే హమారా ప్రసాద్ అంశంపై మౌనంగా ఎందుకు ఉంటున్నారు బహుజన సమాజానికి సమాధానం చెప్పాలన్నారు.అంబేద్కర్ జీవించి ఉంటే గాడ్సే గాంధీని కాల్చిన విధంగా తాను అంబేద్కర్ ను చంపేవాడిని అని వ్యాఖ్యలు చేసినా ప్రభుత్వం ఎందుకు ఊపా చట్టం కింద కేసు నమోదు చేయడం లేదని ప్రశ్నించారు.జైభీమ్ రావ్ భారత్ పార్టీ ప్రజా సంఘాల నుండి వస్తున్న వ్యతిరేకతతో ప్రభుత్వం అరెస్ట్ చేసినట్టు సమాచారం ఉందని అరెస్ట్ చేసిన హమారా ప్రసాద్ కు బెయిల్ రాకుండా కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గంధం మల్లికార్జునరావు,జిల్లా ప్రధాన కార్యదర్శి మాలోత్ వీరు నాయక్,అసెంబ్లీ అధ్యక్షుడు నాగుల రవికుమార్,కిరణ్,శంకర్ తదితరులు పాల్గొన్నారు

# 19న ఘనంగా హిందీ దివస్..



ప్రజాదివాస్

కామారెడ్డి జిల్లా హిందీ విషయ ఫోరం ఆధ్వర్యంలో ఈ నెల 19న శనివారం హిందీ దివస్ వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఫోరం జిల్లా అధ్యక్షుడు ఇంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి సహిందర్‌నాథ్ తెలిపారు. కామారెడ్డి పట్టణంలోని అశోక్‌నగర్ కాలనీలో ఉన్న వరలక్ష్మి గార్డెన్స్‌లో ఉదయం 10 గంటలకు కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.ఈ కార్యక్రమానికి కామారెడ్డి జిల్లా విద్యాశాఖ అధికారి మల్లికార్జున్ హాజరుకానుండగా, శాతవాహన యూనివర్సిటీ ప్రొఫెసర్ వరప్రసాద్ ప్రధాన వక్తగా పాల్గొంటారని తెలిపారు.కార్యక్రమానికి హాజరయ్యే జిల్లాలోని హిందీ ఉపాధ్యాయులకు ఆన్‌డ్యూటీ సౌకర్యం కల్పించనున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలోని హిందీ ఉపాధ్యాయులందరూ ఉదయం 10 గంటలకు వరలక్ష్మి గార్డెన్స్‌లో జరిగే హిందీ దివస్ కార్యక్రమానికి హాజరై విజయవంతం చేయాలని వారు కోరారు.ఈ సందర్భంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో హిందీ ఫోరం జిల్లా ముఖ్య సలహాదారులు గఫూర్ శిక్షక్, బి.ఎన్. గిరి, గజెల్లి రమేష్ పాల్గొన్నారు.

# అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన హమారా ప్రసాద్‌ను అరెస్ట్ చేయాలి..

**-మాల మహానాడు ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ**



ప్రజాదివాస్

భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన హమారా ప్రసాద్‌ను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ మాల మహానాడు కామారెడ్డి జిల్లా ఆధ్వర్యంలో గురువారం నిరసన ర్యాలీ నిర్వహించారు. కామారెడ్డి మున్సిపల్ కార్యాలయం నుంచి నిజాంసాగర్ చౌరస్తా వరకు ర్యాలీ చేపట్టారు. అనంతరం హమారా ప్రసాద్ దిష్టిబొమ్మను దహనం చేశారు.అక్కడి నుంచి అంబేద్కర్ విగ్రహం వద్దకు చేరుకుని నిరాహార దీక్ష చేస్తున్న నాయకులకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు కంకలాన రమేష్, రాష్ట్ర కార్యదర్శి పెరమండ రాజనర్సింహులు మాట్లాడుతూ.. అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన హమారా ప్రసాద్‌పై తక్షణమే కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. అంబేద్కర్‌ను అవమానించే వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు.హమారా ప్రసాద్‌పై వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకోకపోతే భవిష్యత్‌లో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

# తెలంగాణలో అత్యాధునిక రోబోటిక్ మోకాలి మార్పిడి శస్త్రచికిత్సలు..

ప్రజాదివాస్



హైదరాబాద్ యూరో హాస్పిటల్స్ సమూహం తెలంగాణలో అత్యాధునిక రోబోటిక్ మోకాలి మార్పిడి శస్త్రచికిత్సలను అందుబాటులోకి తీసుకొచ్చింది. మోకాళ్ల నొప్పులతో బాధపడుతున్న రోగులకు మెరుగైన చికిత్స అందించేందుకు సి.ఓ.ఆర్.ఐ. రోబోటిక్ మోకాలి మార్పిడి వ్యవస్థను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు వైద్యులు తెలిపారు.డాక్టర్ వివేకానంద్ ఆధ్వర్యంలో రోబోటిక్ మోకాలి మార్పిడి సేవలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. మాకో రోస నేవీ వంటి ఆధునిక రోబోటిక్ వ్యవస్థలతోపాటు సి.ఓ.ఆర్.ఐ. టెక్నాలజీ ద్వారా మోకాలి మార్పిడి శస్త్రచికిత్సల్లో మరింత ఖచ్చితత్వాన్ని సాధించవచ్చని తెలిపారు.రోగులకు పలు ప్రయోజనాలు రోబోటిక్ మోకాలి మార్పిడి ద్వారా శస్త్రచికిత్సకు ముందే మోకాలి యొక్క త్రీడీ ప్రణాళికను రూపొందించుకోవచ్చు. తద్వారా అవసరమైన ఎముక భాగాన్ని మాత్రమే ఖచ్చితంగా తొలగించడం, ఇంప్లాంట్‌ను సరైన స్థానంలో అమర్చడం సాధ్యమవుతుందని వైద్యులు వివరించారు. దీనివల్ల రక్తస్రావం తగ్గడం, నొప్పి తగ్గడం, వేగంగా కోలుకోవడం వంటి ప్రయోజనాలు ఉంటాయని తెలిపారు.సాంప్రదాయ మోకాలి మార్పిడితో పోలిస్తే రోబోటిక్ విధానంలో అధిక ఖచ్చితత్వం, వ్యక్తిగత అవసరాలకు అనుగుణంగా చికిత్స ప్రణాళిక రూపొందించే అవకాశం ఉంటుందని డాక్టర్ వివేకానంద్ తెలిపారు.అధునాతన సాంకేతికత, అనుభవజ్ఞులైన వైద్య బృందంతో తెలంగాణలో రోగులకు మెరుగైన మోకాలి మార్పిడి సేవలు అందించేందుకు కృషి చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

# ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా జెండా ఆవిష్కరణ

ప్రజాదివాస్



ప్రజాపాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని బీబీపేట్ మండలం మల్కాపూర్ గ్రామపంచాయతీ ఆవరణలో జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జాతీయ జెండాకు గౌరవ వందనం చేశారు.కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ లక్ష్మీ రవికుమార్, గ్రామ కార్యదర్శి వెన్నెల, పాలకవర్గ సభ్యులు చిలుక భాస్కర్, చిలుక రేవతి, అలంగల్ల వెంకటేష్, ఫీల్డ్ అసిస్టెంట్ కృపాల్ రెడ్డి, అంగన్‌వాడీ టీచర్ వసంత, ఆశా కార్యకర్తలు, గ్రామ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

TGTEL/25/A0827
ప్రజా దివాస్
తెలుగు దినపత్రిక
18-09-2026

# రాబోయే రెండేళ్లలో సంగారెడ్డి మెడికల్ కళాశాల దేశంలోనే నెంబర్ వన్

**– వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ**

ప్రజాదివాస్

రాబోయే రెండేళ్లలో సంగారెడ్డి ప్రభుత్వ వైద్య కళాశాలను వైద్య విద్య, వైద్య సేవలు, మౌలిక వసతుల పరంగా దేశంలోనే అగ్రస్థానంలో నిలిపేలా తీర్చిదిద్దుతామని రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు.

గురువారం సంగారెడ్డి మెడికల్ కళాశాల ప్రాంగణంలో హెటిరో ఫౌండేషన్ సౌజన్యంతో రూ.1.50 కోట్ల వ్యయంతో నిర్మించిన బాస్కెట్ బాల్, క్రికెట్, కబడ్డీ కోర్టులు, ఓపెన్ క్రికెట్ గ్రౌండ్ ను మంత్రి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీజీఐఐసీ చైర్మన్ నిర్మలా జగ్గారెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, ఎస్పీ పారితోష్ పంకజ్ పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి మంత్రి క్రికెట్ ఆడి వారిలో ఉత్సాహం నింపారు.తదనంతరం కళాశాల ఆడిటోరియంలో నిర్వహించిన విద్యార్థుల ముఖాముఖి కార్యక్రమంలో మంత్రి మాట్లాడారు. వైద్య విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు ఎంతో అవసరమని, క్రీడల వల్ల శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసం, ఏకాగ్రత పెరుగుతాయని అన్నారు. చదువులో మంచి ర్యాంకులు సాధించేందుకు కృషి చేయాలని విద్యార్థులకు సూచించారు.రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి వైద్యం, విద్య, సాధికారత, సామాజిక భద్రత వంటి రంగాలకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని మంత్రి పేర్కొన్నారు. తెలంగాణలో వైద్య రంగాన్ని బలోపేతం చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, మెరుగైన వసతులతో సుమారు రూ.500 కోట్ల వ్యయంతో ఆసుపత్రుల నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. తెలంగాణను వైద్య రంగంలో దేశంలోనే ముందంజలో నిలపడమే లక్ష్యమన్నారు.భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదిగినా సమాజం పట్ల బాధ్యతను మరువరాదని, గ్రామీణ ప్రాంతాల్లో సేవలందించడం ద్వారా ప్రజలకు చేరువ కావాలని విద్యార్థులకు సూచించారు. ప్రభుత్వాలు, నాయకత్వాలు శాశ్వతం కావని, ప్రజలకు నిరంతరం సేవలందించేలా వ్యవస్థలను బలోపేతం చేయడమే ముఖ్యమని అన్నారు.అనంతరం యూనియన్ బ్యాంక్ సోషల్ ఫౌండేషన్ సహకారంతో సీఎస్ఆర్ నిధుల కింద క్షయ వ్యాధిగ్రస్తులకు పోషకాహార కిట్లను మంత్రి పంపిణీ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 700 మంది రోగులకు నెలకు ఒక కిట్ చొప్పున




6 నెలల పాటు ఉచితంగా కిట్లను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. టీబీ నిర్మూలనకు ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు, బ్యాంకుల భాగస్వామ్యం అవసరమన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ జి. అంజయ్య, అదనపు కలెక్టర్ పాండు, జీజీహెచ్ సూపరింటెండెంట్ డా. మురళీకృష్ణ, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డా. ప్రకాశరావు, ఆర్డీఓ రాజేందర్, హెటిరో ఫౌండేషన్ ప్రతినిధి సుధాకర్, విద్యార్థులు, అధికారులు పాల్గొన్నారు.
30

# తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట స్ఫూర్తితో పోడు భూములకు పట్టాలు ఇవ్వాలి

ప్రజాదివాస్

ఉప్పలచిలక గ్రామంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వార్షికోత్సవ సభ ఉప్పలచిలక గ్రామంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వార్షికోత్సవాల సందర్భంగా సభ నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు గాయం తిరుపతిరావు మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం భూస్వామ్య దోపిడీ వెట్టిచాకిరి నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా సాగిన చారిత్రాత్మక పోరాటమని అన్నారు రైతులు వ్యవసాయ కూలీలు పేద ప్రజలు తమ భూమి భుక్తి విముక్తి కోసం ఐక్యంగా పోరాడిన ఫలితంగానే అనేక భూసంస్కరణలకు మార్గం ఏర్పడిందని తెలిపారు ఆ పోరాటంలో వేలాది మంది రైతులు కూలీలు మహిళలు త్యాగాలు



చేశారని వారి పోరాట స్ఫూర్తిని నేటి తరాలు కొనసాగించాలని అన్నారు అడవులు పోడు భూములపై ఆధారపడి జీవిస్తున్న పేద గిరిజనులు దళితులు బీసీలకు భూమిపై హక్కులు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు ఎస్సీ బీసీలకు కూడా పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు ఎన్నో సంవత్సరాలుగా సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న పేదలకు భూమిపై చట్టబద్ధమైన హక్కులు కల్పించి వారికి భద్రత కల్పించాలని కోరారు పోడు భూముల సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు అర్హులైన సాగుదారులందరి దరఖాస్తులను పరిశీలించి ఎలాంటి వివక్ష లేకుండా పట్టాలు మంజూరు చేయాలని అన్నారు భూమిలేని వ్యవసాయ కూలీలు పేద రైతులకు సాగుభూమి అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట అమరుల ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు రైతులు వ్యవసాయ కూలీలు పేద ప్రజలు ఐక్యంగా ఉద్యమించాలని గాయం తిరుపతిరావు పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో తెలంగాణ కార్మిక సంఘం మండల కార్యదర్శి చెమట విశ్వనాథ జొన్నలగడ్డ పాల్గొన్నారు

# బొప్పాన్ పల్లి గ్రామంలో ఘనంగా ప్రజా పాలన దినోత్సవం

ప్రజాదివాస్

ఝరాసంగం మండలంలోని బొప్పాన్ పల్లి గ్రామంలో ప్రజా పాలన దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి సర్పంచ్ ముంగి అమృత్, ఉప సర్పంచ్ రాములు, మండల మైనార్టీ అధ్యక్షుడు సయ్యద్ షకీల్, మాజీ సర్పంచ్ బాలయ్య, వార్డు సభ్యులు, గ్రామ కాంగ్రెస్ నాయకులు, యువకులు, గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున హాజరయ్యారు.ఈ సందర్భంగా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి ప్రజా పాలన దినోత్సవం ప్రాధాన్యతను వివరించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజల భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని, గ్రామస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉండే పాలన ద్వారా గ్రామ అభివృద్ధి మరింత వేగంగా సాధ్యమవుతుందని నాయకులు పేర్కొన్నారు.గ్రామంలో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు, తాగునీరు, పారిశుద్ధ్యం, రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్ తదితర సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటికి పరిష్కారం చూపే విధంగా పాలన కొనసాగించడమే ప్రజా పాలన లక్ష్యమని పేర్కొన్నారు.సర్పంచ్ ముంగి అమృత్ మాట్లాడుతూ గ్రామ ప్రజల సహకారంతో బొప్పాన్ పల్లి గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. గ్రామంలో ప్రజలకు అవసరమైన సమస్యలను ప్రాధాన్యత క్రమంలో గుర్తించి పరిష్కరించేందుకు పంచాయతీ పాలకవర్గం నిరంతరం కృషి చేస్తోందన్నారు. గ్రామ అభివృద్ధిలో ప్రతి ఒక్కరి భాగస్వామ్యం ఉండాలని, ప్రజలు తమ సమస్యలను పంచాయతీ దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని అన్నారు.ఉప సర్పంచ్ రాములు మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు సమిష్టిగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టేందుకు పాలకవర్గం కృషి చేస్తుందని తెలిపారు.మండల మైనార్టీ అధ్యక్షుడు సయ్యద్ షకీల్, మాజీ సర్పంచ్ బాలయ్య మాట్లాడుతూ ప్రజల భాగస్వామ్యంతోనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని పేర్కొన్నారు. ప్రజా పాలన దినోత్సవం సందర్భంగా గ్రామ ప్రజలందరూ ఐక్యంగా ఉండి గ్రామాభివృద్ధికి





సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, గ్రామ కాంగ్రెస్ నాయకులు, యువకులు, మహిళలు, గ్రామ పెద్దలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. అనంతరం గ్రామాభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం, ప్రజలకు మెరుగైన సేవలు అందించడంపై నాయకులు మరియు గ్రామస్థులు చర్చించారు.ప్రజల భాగస్వామ్యం – గ్రామాభివృద్ధికి బలమైన పునాది అనే సందేశంతో బొప్పాన్ పల్లిలో ప్రజా పాలన దినోత్సవ వేడుకలు ఉత్సాహభరిత వాతావరణంలో ముగిశాయి.

# దివ్యాంగులు ఆత్మ గౌరవంతో జీవించాలి

**-మెదక్ ఎంపీ రఘునందన్ రావు**






ప్రజాదివాస్

మెదక్ జిల్లా కలెక్టర్ కార్యాలయం లో గల సమావేశ మందిరంలో గురువారం నాడు దివ్యాంగుల సహాయ పరికరాల పంపిణీ కార్యక్రమానికి మెదక్ ఎంపీ రఘునందన్ రావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. దేశ ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా వికలాంగుల కు ఈ కార్యక్రమం నిర్వహించడం గొప్ప విషయం అన్నారు.మోదీ గారు గత 25 సంవత్సరాలుగా పేద ప్రజలకు ప్రజా సేవ చేస్తున్నారని గుర్తు చేశారు.6 నెలలుగా 461 మంది దివ్యాంగులను గుర్తించి 850 దివ్యాంగ సహాయ పరికరాలను పంపిణీ చేస్తున్నట్లు వివరించారు.దివ్యాంగులు మొన్న జరిగిన గ్లాస్గో క్రీడల్లో ప్రపంచంలో 4 వ స్థానం సాధించి 39 పథకాలు ఇండియాకు తీసుకొచ్చారని , ఇన్ని పథకాలు ఏ క్రీడలకు కూడా ఇండియాకు రాలేదని,దివ్యాంగులు ఎవరికి తక్కువకాని ఆత్మవిశ్వాసంతో జీవించాలని అన్నారు.దివ్యాంగులు సమాజంలో గౌరవప్రదంగా,స్వయం ఆధారితంగా జీవించేందుకు అవసరమైన సహాయాన్ని అందించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.దివ్యాంగులకు అందుబాటులో ఉండేలా అడ్డంకులు లేని సమగ్ర,సౌకర్యవంతమైన సమాజ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాల్లో భాగంగా ఈ శిబిరాలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ..సహాయ పరికరాల పంపిణీ ద్వారా దివ్యాంగుల చలనశీలత,వినికిడి సామర్థ్యం,దైనందిన కార్యకలాపాల్లో స్వయం ఆధారితత మెరుగుపడటంతో పాటు వారి ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేందుకు దోహదపడుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో జెడ్పి సీఈఓ ఎల్లయ్య,డి ఆర్ వో అంబాదాస్ రాజేశ్వర్, సంబంధిత శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# మను మయ సంఘము ఆధ్వర్యంలో ఘనంగా విశ్వకర్మ జయంతి ఉత్సవాలు.



ప్రజాదివాస్

అందోల్ నియోజకవర్గం జోగిపేట మున్సిపాలిటీ లోని జోగిపేట స్థానిక మాణిక్య ప్రభు మందిరంలో మనుమయ సంఘం ఆధ్వర్యంలో విశ్వకర్మ జయంతి సందర్భంగా విశ్వకర్మలు అందరు కలిసి ఘనంగా విశ్వకర్మ జయంతి ఉత్సవాలు నిర్వహించారు ఈ కార్యక్రమంలో భాగంగా ఆందోల్ మండల అధ్యక్షులు మనుమల్లాచారి మాట్లాడుతూ విశ్వకర్మలు రాజకీయంగా ఎదగాలని, రాజకీయ నాయకులు విశ్వకర్మ లను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించడం లేదని విశ్వకర్మల పట్ల అష్టద చూపుతున్నారని ఎవరైతే కులవృత్తి పైన ఆధారపడి ఉన్నారు వారికి తగిన పనిముట్లను అందజేయాలని ఇప్పటికే గత ప్రభుత్వము వేరే కులాలకు సైకిల్ మోటార్ లు, ఆటోలు అందించారు కానీ మా వృత్తి పని చేసుకునే వారిని గుర్తించడం లేదని ఆయన అన్నారు కేంద్ర ప్రభుత్వం నరేంద్ర మోడీ గుర్తించినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు గుర్తించడం లేదో తెలియజేయాలని అలాగే సెప్టెంబర్ 17 ను వెంటనే ప్రభుత్వ సెలవు దినంగా ప్రకటించాలని డిమాండ్ వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు అనిల్ చారి, ముత్తయ్య వడ్ల వేణుగోపాల్ చారి కమ్మరి రాములు, సత్యనారాయణ, గురు ప్రసాద్ ,రాజేష్ తదితరులు పాల్గొన్నారు

# స్వచ్ఛతా హీ సేవా -2026 కార్యక్రమం

**- పాల్గొన్న జిల్లా పంచాయతీ అధికారి బి. అనూష**



ప్రజాదివాస్
పాల్వంచ : స్వచ్ఛతా హీ సేవా-2026 కార్యక్రమంలో భాగంగా 1వ రోజు షెడ్యూల్‌లో భాగంగా పాల్వంచ మండలం లక్ష్మీదేవిపల్లి(ఎస్ ) గ్రామ పంచాయతీ పరిధిలోని గురుకుల పాఠశాలలో జిల్లా పంచాయతీ అధికారి బి. అనూష పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులకు ఎస్ డబ్లు ఏం రూల్స్ -2026లో సూచించిన నాలుగు రకాల వ్యర్థాల వేరు వేరు సేకరణ 4-వే సెగ్రిగేషన్ పై అవగాహన కల్పించారు. వ్యర్థాలను మూలస్థాయిలోనే సక్రమంగా వేరు చేయడం, పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్యం పర్యావరణ పరిరక్షణ, సుస్థిరత ప్రాముఖ్యతను వివరించారు. విద్యార్థులు తమ ఇళ్లలో, పాఠశాలలో పరిసరాల్లో పరిశుభ్రతను పాటిస్తూ, వ్యర్థాలను వేరు చేసి నిర్వహించేలా చైతన్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీదేవిపల్లి(గ్రా) గ్రామ పంచాయతీ సర్పంచ్, వార్డు సభ్యులు, పాల్వంచ ఎంపీవో , పంచాయతీ కార్యదర్శి, గురుకుల పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# భక్తి.. భద్రత.. బాధ్యతతో గణేష్ ఉత్సవాలు..

ప్రజాదివాస్
గణేష్ నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని కామారెడ్డి పట్టణ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో గురువారం భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర, ఐపీఎస్ ముఖ్య అతిథిగా హాజరై విఘ్నేశ్వరునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానాన్ని ప్రారంభించి భక్తులకు స్వయంగా



అన్నప్రసాదాన్ని వడ్డించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ కామారెడ్డి జిల్లాలో ప్రజల ఆత్మీయత, పరస్పర సహకారం, ఐకమత్యం ప్రత్యేకతగా నిలుస్తున్నాయని అన్నారు. అధికారులు, సిబ్బంది సమన్వయంతో అంకితభావంతో పనిచేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. గణేష్ నవరాత్రి ఉత్సవాలను ప్రజలు భక్తిశ్రద్ధలతో, సోదరభావంతో జరుపుకోవాలని కోరారు. మండప నిర్వాహకులు పోలీస్ శాఖ సూచించిన మార్గదర్శకాలు, నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ప్రజలు, ఉత్సవ నిర్వాహకులు పోలీస్ శాఖకు సహకరించాలని కోరారు. “భక్తి, భద్రత, బాధ్యత” అనే సూత్రంతో ఉత్సవాలను ప్రశాంతంగా, ఆనందంగా నిర్వహించుకుందామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి డీఎస్పీ ఎస్. మధుసూదన్, పట్టణ ఎస్‌హెచ్ఓ బి. నరహరి, పోలీస్ అధికారులు, సిబ్బంది, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.

# జాతీయ సమైక్యత దినోత్సవం

**- బి ఆర్ ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు పూజ నరేందర్**

ప్రజాదివాస్
ఈరోజు సెప్టెంబర్ 17 న ఆర్మూర్ లో బి ఆర్ ఎస్ పార్టీ గద్దె వద్ద జాతీయ సమైక్యత దీనోత్సవాన్ని బి ఆర్ ఎస్ పారీ పట్టణ అధ్యక్షులు పూజ నరేందర్ ఆధ్వర్యంలో జాతీయ



జెండా ఎగరావేసి ఘనంగా నిర్వహించడం జరిగింది. చరిత్ర 1948 సెప్టెంబర్ 17న హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో విలీనమైంది. గుర్తింపు నిజాం పాలన నుండి విముక్తి పొంది, ప్రజలు ప్రజాస్వామ్య పాలనలోకి అడుగుపెట్టిన ఈ చారిత్రక దినాన్ని సమైక్యతా దినంగా జరుపుకుంటారు. ఇట్టి కార్యక్రమం లో కౌన్సిలర్ లు నడిం,నయీమ్, దినేష్, అజిమ్ సీనియర్ నాయకులు పోలా సుధాకర్, సుంకరి రవి, లాటీఫ్,రాక్షుద్, సైఫ్ బి ఆర్ ఎస్ పార్టీ అర్మూర్ మండల యువజన అధ్యక్షులు అగ్గు క్రాంతి,వార్డ్ ఇంచార్జ్ లు ఎం జే రామ్, కళ్యాణ్, ప్రవీణ్ గౌడ్, నర్సయ్య,తైసీం, , హైమద్ నక్కల రాములు తదితరులు పాల్గొన్నారు.

# మొబైల్ సైన్స్ ల్యాబ్ ఎక్కడ?

ప్రజాదివాస్
మారుమూల గిరిజన ప్రాంతమైనటువంటి కొమరం భీము జిల్లాను దృష్టిలో ఉంచుకొని సి ఎస్ ఆర్ ఫండ్స్ కింద దీఎజూ వారూ మొబైల్ సైన్స్ ల్యాబ్ ఈ జిల్లాకు ఇవ్వడం జరిగింది. సింగరేణి వారు దీని నిర్వహణ కొరకు నిధులను కేటాయిస్తున్నారు. కొమరం భీం జిల్లా అనగానే ఎస్సీ ఎస్టీలు అధికంగా ఉండే జిల్లా మరియు మారుమూల ప్రాంతం కావున అక్షరాస్యత శాతం తక్కువగా ఉంటుంది దీనివల్ల మూఢనమ్మకాలు అధికంగా ఉంటాయి

ఈ మూఢనమ్మకాలు తొలగాలి అంటే ఈ జిల్లాలో అక్షరాస్యత శాతం పెరగాలి ముఖ్యంగా ఈ ప్రాంతంలో చదువుకుంటున్నటువంటి ఎస్సీ, ఎస్టీ బీసీ మైనార్టీలు చదువులో రాణించాలి మూఢనమ్మకాల కి దూరంగా ఉండాలి అంటే ఇలాంటి మొబైల్ సైన్స్ ల్యాబ్ యొక్క అవసరం ఎంతైనా ఉంది.

ఈ మొబైల్ సైన్స్ ల్యాబ్ ప్రస్తుతం ఎక్కడ ఉన్నట్లు? ఈ మొబైల్ సైన్స్ ల్యాబ్ కు సంబంధించిన నిధులు ఎక్కడ? జమ చేయబడుతున్నాయి ఎవరి ఖాతాలో జమ చేయబడుతున్నాయి ? నిధుల దుర్వినియోగం జరుగుతున్నట్లు సమాచారం అందుతా ఉన్నది మొబైల్ సైన్స్ ల్యాబ్ ను గౌరవ జిల్లా సైన్స్ అధికారి ప్రతి పాఠశాలకు తిప్పి విద్యార్థుల్లకు 80% సైన్స్ సంబంధిత ప్రాజెక్టను మోడల్స్ ను బోధించడానికి అనుకూలంగా ఉన్న ఈ జిల్లా అధికారి నిర్లక్ష్యం మూలంగా అది సఫలం కావడం లేదు. సైన్స్ సంబంధిత విషయాలలో అవగాహన కల్పించవలసిన అవసరం ఉన్నది .కానీ గత సంవత్సర కాలం నుండి ఈ మొబైల్ సైన్స్ ల్యాబ్ ఏ పాఠశాలలో కూడా తీసుకువెళ్లి సందర్శనలో ఉంచినట్లు దాఖలలో లేవు కేవలము పై అధికారులు లేదా మంత్రులు వచ్చినప్పుడు మాత్రమే ఈ మొబైల్ సైన్స్ ల్యాబ్ ను తీసుకువచ్చి సందర్శన కొరకు ఉంచుతున్నారు గత సంవత్సరం కేంద్ర మంత్రి హన్స్ మల్హోత్రా గారు వచ్చినప్పుడు మాత్రమే జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల జనకాపూర్ వద్ద ఉంచి సందర్శన కొరకు విద్యార్థులకు చూపించారు తప్ప పాఠశాలలో తిప్పడం లేదు. అలాంటప్పుడు ఈ సైన్స్ ల్యాబ్ దేనికి ఉపయోగపడుతున్నట్లు ఈ సైన్స్ ల్యాబ్ ను జిల్లా విద్యాశాఖ అధికారి గారి కార్యాలయంలో వారి ఆధీనంలో ఉంచవలసింది పోయి ఎక్కడో తనకి ఇష్టమైన చోటు ఈ మొబైల్ సైన్స్ ల్యాబ్ ను ఉంచుతున్నట్లు అర్థమవుతుంది .జిల్లా సైన్స్ అధికారి ఈ మొబైల్ సైన్స్ ల్యాబ్ ప్రతి పాఠశాలకు తీసుకు వెళ్లకుండా, తను మాత్రం జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో కూర్చొని పైరవీలు చేస్తూ తన అన్యాయులకు జూనియర్లకు అవకాశాలు మెండుగా కల్పిస్తూ ఆఫీస్కే పరిమితమవుతున్నారు. జిల్లా సైన్స్ అధికారి ఇలా ఉంటే జిల్లాలో సైన్స్ ఎలా వర్ధిల్లుతుంది? రోజురోజుకు సైన్స్ అండ్ టెక్నాలజీ పెరుగుతా ఉన్నది ప్రజల్లో సైన్స్ పట్ల ఆసక్తిని ,విద్యార్థులో సైన్స్ పట్ల ఆసక్తిని




పెంచవలసిన అవసరం ఉన్నది. సైన్స్ పట్ల ఆసక్తి పెరగాలంటే మొబైల్ సైన్స్ ల్యాబ్ అందుబాటులో ఉండవలసిందే కదా. మొబైల్ సైన్స్ ల్యాబ్ ను సరిగ్గా నిర్వహించకుండా ఉంచుతున్నటువంటి ఈ జిల్లా సైన్స్ అధికారిపై చర్యలు తీసుకోవాలని ఎస్సీ ఎస్టీ కొమరం భీం జిల్లా ఉపాధ్యాయ సంఘం తరఫున జిల్లా విద్యాశాఖ అధికారి ,జిల్లా కలెక్టర్ , అడిషనల్ కలెక్టర్ కి విజ్ఞప్తి ఏమనగా ఈ సైన్స్ ల్యాబ్ జిల్లాలోని విద్యార్థులకు ఉపయోగపడేలా, ఉపయోగంలోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేస్తూ ఉన్నాం అని ఒక ప్రకటనలో ఎస్సీ ఎస్టీ యూనియన్ కొమరం భీం జిల్లా ప్రధాన కార్యదర్శి వడ్లూరి రాజేష్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేడి చరణ్దాస్ ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు

# పేదల భూసమస్యల పరిష్కారానికి శాశ్వత మార్గం: సీఎంకు విప్ ఆది శ్రీనివాస్ ధన్యవాదాలు

**-సిరిసిల్లలో 2,000 ఎకరాల భూములు 22ఏ నుంచి విడుదల: వేములవాడ ఎమ్మెల్యే**

**-పెద్దల కబ్జా భూములను స్వాధీనం చేసుకుని పేదలకే పంపిణీ చేస్తాం: ఆది శ్రీనివాస్**

**-ధరణి, 22ఏ భూముల పరిష్కారానికి హైలెవల్ కమిటీ ఏర్పాటు: ప్రభుత్వ విప్**

రాజన్న సిరిసిల్ల జిల్లా / సెప్టెంబర్ 17
ప్రజాదివాస్
రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన ప్రజా పాలన దినోత్సవ వేడుకల్లో ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పాల్గొన్నారు. తెలంగాణలో పేదల భూసమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలపై రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రజల తరఫున ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ప్రజాపాలన అంటే ఇందిరమ్మ



రాజ్యమని, పేదలకు న్యాయం జరిగేలా ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని పేర్కొన్నారు.
గత పదేళ్ల పాలనలో ధరణి, 22ఏ నిబంధనల కారణంగా పేదలు తమ భూముల విషయంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని విమర్శించారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఇప్పటికే 2,000 ఎకరాలకు పైగా పేదల భూములను 22ఏ జాబితా నుంచి ప్రభుత్వం తొలగించిందని వెల్లడించారు. కేసీఆర్ ఫామ్‌హౌస్ పరిసరాల్లోని మిగులు భూములతో పాటు సిరిసిల్లలోని సుమారు 8,000 ఎకరాల ఆక్రమిత భూములపై కూడా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు. పెద్దల నుంచి స్వాధీనం చేసుకున్న భూములను అర్హులైన పేదలకే పంపిణీ చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చినట్లు గుర్తుచేశారు. 22ఏ భూముల సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు వీలుగా 12 అంశాలతో కూడిన ప్రత్యేక మార్గదర్శకాలను ప్రభుత్వం విడుదల చేసిందని, ఈ ప్రక్రియ కోసం ముగ్గురు సభ్యులతో కూడిన ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సిరిసిల్లతో పాటు హైదరాబాద్ తదితర ప్రాంతాల్లో ప్రభుత్వ స్థలాల్లో పేదలు నిర్మించుకున్న ఇళ్లను నిబంధనల ప్రకారం క్రమబద్ధీకరించేందుకు చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. ప్రజల భూములు, ఇళ్లు, హక్కులకు సంపూర్ణ రక్షణ కల్పిస్తూ పేదల పక్షాన నిలబడటమే ఈ ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని వివరించారు.

# తెలంగాణ విమోచన దినోత్సవ వేడుకలు



ముస్తాబాద్ / సెప్టెంబర్ 17 ప్రజా దివాస్
తెలంగాణ విమోచన దినోత్సవాన్ని పురస్కరించుకుని ముస్తాబాద్ మండల భారతీయ జనతా పార్టీ శాఖ ఆధ్వర్యంలో మండల అధ్యక్షులు సొల్ల క్రాంతి కుమార్ ఆధ్వర్యంలో గురువారం (సెప్టెంబర్ 17) విమోచన దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు జాతీయ పతాకావిష్కరణ నిర్వహించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు మాట్లాడుతూ రజాకార్ల పాలన నుండి విముక్తి: 1948 సెప్టెంబర్ 17న సర్దార్ వల్లభభాయ్ పటేల్ చేపట్టిన “ఆపరేషన్ పోలో” ద్వారా నిజాం మరియు రజాకార్ల రక్షస పాలన నుండి తెలంగాణ ప్రాంతానికి విముక్తి లభించిందని కొనియాడారు అమరుల త్యాగాలు చిరస్మరణీయం,నైజాం నిరంకుశత్వానికి వ్యతిరేకంగా పోరాడి ప్రాణాలర్పించిన వీరుల త్యాగాలు తరతరాలకి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు విమోచన దినోత్సవ ప్రాముఖ్యత సెప్టెంబర్ 17ను అధికారికంగా తెలంగాణ విమోచన దినోత్సవంగా ప్రతి ఒక్కరూ గర్వంగా జరుపుకున్నారుఈ కార్యక్రమం లో మండల ప్రధానకార్యదర్శి ఎదునూరి గోపికృష్ణ, జిల్లా ఉపాధ్యక్షులు మల్లారపు సంతోష్ రెడ్డి, జిల్లా కౌన్సిల్ మెంబర్ మెరుగు అంజాగౌడ్,కరెడ్ల మల్లారెడ్డి,సేవా సంకల్ప్ అభియాన్ మండల కన్వీనర్ చిట్టినేని శ్రీనివాస్ రావు,కో కన్వీనర్ దీటి సత్యం,ఉపసర్పంచ్ కోల కృష్ణ,మండల ఉపాధ్యక్షులు చికోటి మహేశ్,వరి వెంకటేష్,కమిటీకారి పద్మ, హరిబాబు,పప్పుల శ్రీకాంత్,వినయ్,ప్రశాంత్, చందు,యాదగిరి,ప్రణవ్ సాయి,శ్యామ్ బీజేపీ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# ముస్తాబాదులో గొర్రెలు దొంగతనం

**గుర్తుతెలియని దొంగలు**

ముస్తాబాద్/ సెప్టెంబర్ 17 ప్రజా దివాస్
రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండల కేంద్రంలో బుధవారం రాత్రి బండారి లింగయ్య గొర్రెల మంద నుండి ఒక పొట్టేలు, ఒక్క గొర్రెను గుర్తుతెలియని దొంగలు ఎత్తుకెళ్లారని ముస్తాబాద్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసినట్లు బాధితులు తెలిపారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత రెండు నెలల క్రితం కూడా రెండు గొర్రెలు గుర్తు తెలియని దొంగలు ఎత్తుకెళ్లారని దాదాపు వాటి విలువ 30 వేలకు ఉంటుందన్నారు ఫిర్యాదు పై స్పందించిన ముస్తాబాద్ ఎస్సై జ్యోతి దొంగలను పట్టుకొని శిక్షిస్తామని వారన్నారు



# అవార్డులు , అవకాశాలు కావాలా?
# జిల్లా సైన్స్ అధికారిని సంప్రదించ వలసిందే

ప్రజాదివాస్

కొమరం భీము జిల్లాలో అవార్డు కావాలన్నా ,అవకాశాలు కావాలన్నా ఈ జిల్లా సైన్స్ అధికారికి అనుకూలంగా ఉంటే అన్ని అందుతాయి జూనియర్లైన, సీనియర్లు అయిపోతారు అర్హతలు లేకపోయినా అందలమెక్కిస్తారు తను అనుకున్నది సాధిస్తారు తనకు నచ్చని వారు ఉంటే, తను ఎంతటి వారైనా పట్టు పట్టి వదలకుండా వారిని తొలగించే వరకు నిద్రపోరు ఎందుకంటే ఆయన బలం అంత పెద్దది రాష్ట్రస్థాయిలో తనకు అనుకూలమైనటువంటి నాయకుని ఒకరిని పెట్టుకుని రాష్ట్రస్థాయిలో ఉండే అధికారులను ఆయన చేత పురమాయిస్తూ, ఫిర్యాదులు వేయిస్తూ తన అనుకున్నది సాధించుకుంటారు ఈ జిల్లా సైన్స్ అధికారి. తనకు నచ్చితే అది రూల్స్ కు వ్యతిరేకంగా ఉన్న పర్వాలేదు తన వద్ద ఉన్న అధికారం, అంగబలం ,ధన బలం, అధికార బలం తో తనవైపు తిప్పుకుంటారు. తన తప్పులు ఉన్న అధికారుల వద్దకు రాజకీయ నాయకుల వద్దకు వెళ్లి వ్యతిరేక ప్రచారం చేసి తప్పును ఒప్పుగా మార్చుకోగల ధీరుడు ఈ సైన్స్ అధికారి.జిల్లాలో ఉన్న సైన్సు ఉపాధ్యాయులు తాను చెప్పినట్లు వినకపోతే బెదిరిస్తారు, భయపెడతారు.ఈ జిల్లా సైన్స్ అధికారి సొంత పాఠశాలలో ప్రతి సంవత్సరం 40 నుండి 67 శాతం రిజల్ట్ మాత్రమే పదో తరగతిలో వస్తున్న.... తను మాత్రం వ్యక్తిగతంగా కొనసాగిస్తున్న మాస్టర్ మైండ్స్ కార్యక్రమంలో కేవలం భౌతిక శాస్త్రం , అప్పుడప్పుడు గణితం బోధిస్తూ ఆదియు కేవలం తెలుగు మాధ్యమంలో బోధిస్తారు కానీ వేరే పాఠశాలల్లో ఉత్తీర్ణత శాతం అధికంగా వస్తే ఆ ఉత్తీర్ణత శాతం తన వల్లనే తన మాస్టర్ మైండ్ వల్లనే వస్తున్నట్లు విద్యార్థులు పాలిటెక్నిక్ ,ట్రిబుల్ ఐటీ, కాలేజ్ ఆఫ్ ఎక్సెన్స్ , మోడల్ స్కూల్ మొదలగు పాఠశాలల్లో సీట్లు వస్తే తన వల్ల వచ్చినట్లు ప్రచారం చేసుకుంటూ జిల్లాలోని అధికారులను తప్పుదోవ పట్టిస్తూ తను మాత్రం రాబోయే కాలంలో జాతీయస్థాయి అవార్డు కొరకు పునాదులను సిద్ధం చేసుకుంటున్నారు.వేరే పాఠశాల విద్యార్థినికి పేటెంట్ రైట్స్ వస్తే తన మార్గదర్శకత్వం లోనే ఆ విద్యార్థికి పెటెంట్ రైట్స్ వచ్చినట్లు జిల్లా స్థాయి అధికారుల నుండి మొదలు పెట్టుకొని రాష్ట్రస్థాయి అధికారుల వరకు తీసుకువెళ్లి కీర్తి ప్రతిష్టలను తన ఖాతాలో వేసుకున్నారు. అంత మాత్రమే కాదు ఆ పేటెంట్స్ సాధించిన ఉపాధ్యాయుని పిలిపించి తనకు అనుకూలంగా స్టేట్మెంట్లు పత్రికల్లో ఇప్పించడం ఈమధ్య మనం చూసే ఉన్నాం. జిల్లా సైన్స్ అధికారి కొమరం భీమ్ గారు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును ఎలా తీసుకున్నారు? ఇతను ఎలా అవార్డుకు అర్హుడు. ఇయనా ఉండేది జిల్లా విద్యాశాఖలో సైన్స్ ఆఫీసర్గా పని చేస్తూ మాతృ పాఠశాల విద్యార్థుల బోధనకు దూరంగా ఉంటూ,తన మాతృ పాఠశాలలో విద్యార్థులకు బోధించడం లేదు ఎవరైతే పాఠశాలలో ఉండి విద్యార్థుల ఉన్నతి కొరకు, పాఠశాలలో విద్యార్థుల సంఖ్య నమోదు, పాఠశాల అభివృద్ధి పాటు పడే వారికి మాత్రమే రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు ఇస్తారు అలాంటప్పుడు ఈయన ఏ అర్హతతో ఈ అవార్డును తీసుకున్నారు. ఒకవేళ ఈ జిల్లా సైన్స్ అధికారి అవార్డు తీసుకోవాలని లక్ష్యం ఉన్నట్లయితే తాను "బెస్ట్ ఎంప్లాయ్ " అని మాత్రమే అవార్డు తీసుకోవాలి కానీ ఇలా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు తీసుకోవడం వల్ల అధికారులను మోసం చేసినట్లే కదా? సైన్సు సంబంధిత కార్యక్రమాలలో తనకు అనుకూలురు అయినా ఉపాధ్యాయులను కార్యక్రమ కన్వీనర్లుగా వేయడం వారి విద్యార్థులని ఎంపిక చేయడం వల్ల చాలామంది ఉపాధ్యాయులు ఇలాంటి సైన్స్ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. ఎందుకంటే ఎంపిక కాబడేవారు తన అన్యాయుల విద్యార్థులు కాబట్టి వెళ్లడము వ్యర్థంగా భావిస్తున్నారు దీనివల్ల ఈ జిల్లాలో ఉన్నటువంటి నిజమైన విద్యార్థులు నష్టపోతున్నారు ఈ సైన్స్ అధికారి ఇన్స్పైర్ ,సైన్స్ కాంగ్రెస్ లాంటి కార్యక్రమాలకు ఒక బినామీ వ్యక్తిని పెట్టుకుని తన ద్వారా ప్రాజెక్టుల రూపకల్పన చేయిస్తూ తాను అందిస్తున్న ప్రాజెక్టులే ఎంపిక అయ్యేలా చేస్తూ తన నుండి పర్సెంటేజీలు తీసుకుంటూ అధికారుల ముందు సైన్స్ ని ఎంతో ఉన్నతంగా తీర్చిదిద్దుతున్నట్లు గొప్పలు చెప్పుకుంటున్నారు. నిజమేమిటంటే విద్యార్థులే గైడ్చర్ల ద్వారా స్వతంత్రంగా తయారు చేయవలసిన ప్రాజెక్టను రెడిమేడ్ ప్రాజెక్టుల ద్వారా తెప్పించి ఇన్స్పైర్ సైన్స్ కాంగ్రెస్ లాంటి వాటిలో ప్రదర్శించడం జరుగుతున్నది. ఇలాంటి సైన్స్ అధికారి ఉంటే సైన్స్ ఎలా బాగుపడుతుంది? మా లక్ష్యం మా ఆశయం మా దేవుడు డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ మరియు ఎమ్మార్పీఎస్ గౌరవ పద్మశ్రీ అవార్డు గ్రహీత మందకృష్ణ మాదిగ ఆలోచన విధానం అందరికీ అన్ని జాతులకు సమాన అవకాశాలు దక్కాలి అన్నదే మా ధ్యేయం బోధించు సమీకరించు పోరాడు అన్నాడు మా ఆరాధ్య దైవం బాబా సాహెబ్ అంబేద్కర్ ఈ నినాదం అందిపుచ్చుకొని కొమరం భీం జిల్లాలో జిల్లా సైన్స్ ఆఫీసర్ కటకం మధుకర్ గారి ఆగడాలు నిరంకుశత్వం పక్షపాత వైఖరి ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయులను అణగద్రొక్కి కేవలం తనకు జేజేలు కొట్టించుకుంటున్నారు ఈడిఎస్ ఓ . అడ్డదారిలో అందలం ఎక్కుతూ ఓహో ఆహా అంటూ జిల్లాలోని సైన్సు ఉపాధ్యాయుల ముందు తన బలనిరూపణ చేసుకుంటున్నారు పత్రిక విలేకరులను ఉపాధ్యాయులను భయభ్రాంతులకు గురి చేస్తూ వారికి ఫోన్లు చేస్తూ హెచ్చరిస్తూ ఉపాధ్యాయుల వాట్సాప్ గ్రూపులో సెట్టింగ్లను మార్చేలా ఒత్తిడి పెంచుతున్నారు ఈయన ధాటికి టీచర్లు గజగజ వనికి పోతున్నారు ఇక అసలు విషయానికొస్తే 1. జిల్లా కేంద్రం ఆసిఫాబాద్ లేక ఎంపీపీ ఎస్ సర్ సిల్క్ కాగజ్నగర్ డివిజనల్ సైన్స్ సెంటర్ రా? లింగాపూర్ లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు విద్యార్థులకు వ్యాయాప్యాసమే కదా ఎంపీపీ ఎస్ సర్ సిల్క్ ఎలా అనుకూలం అవుతుంది. డి ఎస్ ఓ చెప్పినట్లే పది సంవత్సరాల నుండి ఈ ప్రాంతం వారికి అన్యాయం చేస్తున్నట్లే కదా జిల్లా విద్యాశాఖ అధికారి ఉత్తర్వులలో ఉంటే అట్టి కాపీని బహిరంగపరచవలసిన అవసరం ఉంది నోటి మాటకే చెప్తే సరిపోదు. సిఆర్టి కేజీబీవీ కాగజ్నగర్ గారు ఎన్నిసార్లు రిసోర్స్ పర్సన్ గా చేశారు వివరాలు ఇవ్వండి సరిపోదు రెగ్యులర్ సీనియర్ ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు చాలామంది ఉండగా ఈ మేడం గారిని ఎందుకు ఎంచుకుంటున్నారు అవకాశాలు కల్పిస్తున్నారు జిల్లాలో ఇతర మహిళా ఉపాధ్యాయులు లేరా? తేదీ 22 ఏప్రిల్ 2026 తేదీన మాస్టర్ మైండ్స్ పోస్టర్ రిలీజ్ చేస్తూ గౌరవ జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీమతి లలితా మేడం గారికి గ్రీన్ టీచర్ గా పరిచయం చేసిన విషయం ఈనాడు దినపత్రికలో రాయబడింది ఆధారాలు చూడండి ఇస్తున్నాను ఇంతకంటే రుజువులు ఇంకేం కావాలి రుజువులను కూడా అబద్ధాలుగా మార్చే ప్రయత్నం చేస్తున్నారు



అబద్దాలకోరు ఈ జిల్లా సైన్స్ అధికారి. 6. సైన్స్ సంబంధ పోటీలలో నిర్వహణలో ఒక బినామీ వ్యక్తిని నియమించి ఆయనతో ప్రాజెక్టులు చేయిస్తూ అవి కూడా పూర్తిగా సెన్సార్ కు సంబంధించినవి అతని నుండి పర్సెంటేజీలు తీసుకొని మట్టిలోని మాణిక్యాలను వెలికి తీయవలసిన ఈ డి ఎస్ ఓ గారు మరమనుషులను తయారు చేస్తున్నారు ఆ బినామీ వ్యక్తి తయారు చేసిన ప్రాజెక్టులు మాత్రమే ఇన్స్పైర్ లో సెలెక్ట్ అయ్యేలా చూస్తున్నారు కారణం పర్సంటేజీలు. 7. ఎవరైనా ఎదిరించి మాట్లాడితే వారిపై ఆకాశరామన్న ఉత్తరాలు రాయించి అధికారులకు కంప్లీట్ పెడుతూ వారి అవకాశాలను కొల్లగొడుతున్నారు దేని సరియైన ఉదాహరణలు రాకేష్ స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ సైన్స్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చేడువాయి గారిపై మరియు వడ్లూరి రాజేష్ స్కూల్ అసిస్టెంట్ జీవశాస్త్రం జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల జంకాపూర్ గారిపై ఇలాంటి ప్రయత్నాలు చేసి వారిని భయభ్రాంతులకు గురి చేశారు అందుకే జిల్లాలోని సమస్త ఉపాధ్యాయులు ఈ డి ఎస్ అంటే వణికిపోతున్నారు బహిరంగంగా మాట్లాడలేకపోతున్నారు ఆయన బాధితులు ఎందరో అనేక మార్గాలలో తమ అసహనాన్ని వ్యక్తపరుస్తున్నారు. 8. వడ్లూరి రాజేష్ ఉపాధ్యాయిని విషయంలో అయితే పట్టు పట్టి రాష్ట్రస్థాయి అధికారుల వద్ద తన అన్యాయులతో బల నిరూపణ చేస్తూ ఎక్స్పోజర్ విజిట్ కు ఎంపికైన వడ్ల రాజేష్ ను పోకుండా రద్దు చేయించారు అలాగే స్టేట్ బెస్ట్ టీచర్ అవార్డు విషయంలో గత నాలుగు సంవత్సరాల నుండి ప్రతి సంవత్సరం అవార్డుల సమయంలోనే కంప్లీట్ లు పెడుతూ తనకు అవార్డు రాకుండా అడ్డుకుంటున్నారు. 9. జిల్లాలో సైన్స్ కార్యక్రమాలు ప్రభుత్వ నిబంధనలు ఉన్నతాధికారుల సూచనలు పారదర్శక విధానాల ప్రకారమే నిర్వహిస్తున్న అని పైన చెప్పిన లోలోపల మాత్రం జరిగేది కులపిచ్చి బంధుప్రీతి అన్యాయులకు అందలం తనదే రాజ్యం. ఈ జిల్లా సైన్స్ అధికారి 2016 నుండి డిఎస్ఓగా పనిచేస్తున్నారు. ఈయన గారు ఏమైనా పై నుండి బాండ్ పేపరు రాయించుకొని వచ్చారా జన్మతః తానే డీఎస్ఓగా ఉంటానని కావున ఇలాంటి అధికారి జిల్లా సైన్స్ అధికారిగా ఉంటే సైన్స్ లో విద్యార్థుల ఉపాధ్యాయుల ప్రతిభ మరుగున పడే అవకాశం ఉంది ఎందుకంటే ప్రభుత్వ పాఠశాలలో ౦ష ర ఎశీఅశీతీఱఎ దీష లు పెద విద్యార్థులు చదువుతున్నారు. కావున వెంటనే ఈ సైన్స్ అధికారిని కటకం మధుకర్ నుతొలగించి మంచి వ్యక్తికి అవకాశం కల్పించాలని జిల్లా కలెక్టర్ అడిషనల్ కలెక్టర్ జిల్లా విద్యాశాఖ అధికారి గారికి విజ్ఞప్తి చేస్తున్నామని ఈ అధికారి మాటలు విని ఆయన్నే కోనసాగిస్తె వివిధ రకాలుగా నిరసన తెలియజేస్తాం

## రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ 17వ వార్డు సిద్దార్థ నగర్‌లో స్ట్రీట్ లైట్లు ప్రారంభం ఎన్నో ఏళ్ల నిరీక్షణ ఫలితం వార్డు ప్రజల్లో ఆనందం.....



ప్రజాదివాస్

17వ డివిజన్ సిద్ధార్థ నగర్ కాలనీలో ఎన్నో సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న స్ట్రీట్ లైట్ ల వెలుగులు ఈరోజు సాకారం కావడంతో స్థానిక ప్రజల్లో ఆనందం వెల్లువిరిసింది.కొత్తగా విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి స్ట్రీట్ లైట్లకు విద్యుత్ సరఫరా అందుబాటులోకి రావడంతో సిద్ధార్థ నగర్ కాలనీ రాత్రివేళల్లో వెలుగులతో కళకళలాడుతోంది.ఈ అభివృద్ధి పనులకు సహకరించిన గౌరవ ఎమ్మెల్యే మక్కాన్సింగ్ రాజ్ ఠాకూర్ , గౌరవ మేయర్ మహంకాళి స్వామి మరియు సంబంధిత అధికారులకు సిద్ధార్థ నగర్ ప్రజల తరఫున హృదయపూర్వక కృతజ్ఞతలు.అలాగే ప్రజల సమస్యను గుర్తించి, ఎన్నో రోజులుగా చీకటిలో ఉన్న సిద్ధార్థ నగర్‌కు వెలుగులు తీసుకురావడానికి కృషి చేసిన 17వ డివిజన్ కార్పొరేటర్ అనుము స్వరూప రాములు గారికి స్థానిక ప్రజలు ప్రత్యేక అభినందనలు తెలిపారు."ఏళ్ల తరబడి చీకటిలో ఉన్న మా కాలనీకి ఇప్పుడు వెలుగులు రావడం ఎంతో సంతోషంగా ఉంది" అని సిద్ధార్థ నగర్ వాసులు ఆనందం వ్యక్తం చేశారు. ఇటువంటి మంచి కార్యక్రమాలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండడానికి చాలా సంతోషంగా ఉందని మరియు మా గెలుపుకు అన్ని విధాలుగా సహకరించి ఈ కార్యక్రమానికి పిలవగానే వచ్చినటువంటి ఐ రెడ్డి సంపత్ రెడ్డి, జక్కుల దామోదర్, రాజేశం కండె రవి, పాషా ప్రతి కార్యక్రమంలో అందుబాటులో ఉంటున్న యూత్ సభ్యులందరి సహకారంతో రెట్టింపు ఉత్సాహం తో మరిన్ని మంచి కార్యక్రమాలు చేసే ధైర్యాన్ని ఇస్తున్నటువంటి మీ అందరికి మరియు ఇన్నేళ్లుగా వెలుగులు రాకపోయినా వెలుగుల రాక కోసం నాకు తోడుగా ఉంటూ సహకరించినటువంటి సిద్ధార్థ నగర్ ప్రజలందరికీ నాయకులకు కార్యకర్తలకు మహిళలకు కృతజ్ఞతలు తెలియజేసిన కార్పొరేటర్ అనుము స్వరూప రాములు

## జై జై విశ్వకర్మ ఘనంగా విశ్వకర్మ జయంతి మహోత్సవం

**– 108 జల బిందెలతో విశ్వకర్మ భగవానుడికి జలాభిషేకం భక్తులతో కలిసి పాల్గొన్న ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య**



ప్రజాదివాస్

నందిగామ విశ్వకర్మ జయంతి మహోత్సవాన్ని పురస్కరించుకుని నందిగామలో భక్తిశ్రద్ధలతో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు శివాలయం నుంచి వీరబ్రహ్మేంద్ర స్వామి వారి దేవస్థానం వరకు నిర్వహించిన విశ్వకర్మ భగవానుడి ఊరేగింపులో భక్తులు మహిళలు కూటమి నేతలతో కలిసి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పాల్గొన్నారు వర్షాలు లేకపోవడంతో ప్రజల సంక్షేమం సకాలంలో వర్షాలు కురిసి పంటలు సమృద్ధిగా పండాలని ఆకాంక్షిస్తూ మహిళల ఆధ్వర్యంలో 108 జల బిందెలతో విశ్వకర్మ భగవానుడికి జలాభిషేకం నిర్వహించారు ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య భక్తులతో కలిసి ఈ ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొని విశ్వకర్మ భగవానుడిని దర్శించుకున్నారు ఈ సందర్భంగా విశ్వకర్మ భగవానుడి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని రైతులకు అనుకూలమైన వర్షాలు కురిసి పంటలు సమృద్ధిగా పండాలని ఎమ్మెల్యే సౌమ్య ఆకాంక్షించారు కూటమి ప్రభుత్వం ప్రజల సంక్షేమంతో పాటు అన్ని వర్గాల ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తూ ముందుకు సాగుతోందని కూటమి నేతలు పేర్కొన్నారు విశ్వకర్మ జయంతి సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు

## 4కే రన్ ను ప్రారంభించిన డా.పెసర్ విజయ్ చందర్ రెడ్డి

**– బిజెపి భద్రాద్రి కొత్తగూడెం ఇన్చార్జి డా.పెసర్ విజయ్ చందర్ రెడ్డి**

ప్రజాదివాస్

భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా దామెర మండల బీజేపీ శాఖ ఆధ్వర్యంలో "డ్రగ్స్ ఫ్రీ -- సేవ్ యూత్" నినాదంతో 4కే రన్ నిర్వహించారు.దామెర క్రాస్‌లోని డిస్నీలాండ్ హైస్కూల్ నుంచి ఊరుగొండ వరకు నిర్వహించిన ఈ రన్‌ను ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ పెసర విజయ్ చందర్ రెడ్డి జాతీయ జెండా ఊపి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన




మాట్లాడుతూ యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండి ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు.అలాగే నరేంద్ర మోదీ జన్మదినం, విశ్వకర్మ జయంతి ప్రాముఖ్యతను వివరించారు.అనంతరం దుర్గంపేట గ్రామంలో నరేంద్ర మోదీ జన్మదిన వేడుకలు నిర్వహించి కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు మండల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.